విలేకరులు కావలెను
కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
అనుభవం ఉన్న విలేకరులు కావలెను..
తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు
అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై
పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే
సంప్రదించండి.. సెల్ నెం: 9700370499
సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు

విజయ సారథి
RNI / APTEL/2015/64956
తెలుగు దినపత్రిక

టీవీ రిపోర్టర్లు కావలెను
A.P VISION TV
రెండు తెలుగు రాష్ట్రాలలో
సంచలనం సృష్టిస్తున్న
విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో
గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను.
ఆసక్తి ఉన్న వారు వెంటనే
సం॥ సెల్ నెం: 9700370499
యండి. పి.వెంకటేశ్వర్లు

చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | గురువారం 17-04-2025 | సంపుటి : 11 | సంచిక : 88 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

# రాష్ట్రాన్ని నిలబెట్టండి..దేశం నిలబడుతుంది

**ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రత్యేక దృష్టి సారించండి**
**గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల అప్పుల కుప్ప**
**అభివృద్ధి చేసుకుంటూనే ముందుకు సాగుతున్నాం**
**అమరావతి, పోలవరం, బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్**
**16వ ఆర్థిక సంఘం ప్రతినిధులతో చంద్రబాబు భేటీ**

అమరావతి,ఏప్రిల్16: రాష్ట్ర పునర్నిర్మాణానికి అండగా నిలవాలని 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈరోజు చేసే ప్రతి సాయం అది భారత్‌ను నిలబెడుతుందని అన్నారు. రాష్ట్రాన్ని ప్రత్యేకంగా చూసి ఆర్థిక సాయం అందించాలని... స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికకు ఊతం ఇవ్వాలన్నారు. బుధవారం సచివాలయంలో ఆర్థిక సంఘం సభ్యులతో సీఎం సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం అధికారులకు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద సీఎం చంద్రబాబు స్వయంగా స్వాగతం పలికారు. ఇక, సచివాలయంలోని మొదటి బ్లాక్ లో ప్రభుత్వం ఏర్పాటు- చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు లాంటి అంశాలపై ఎగ్జిబిషన్ ఏర్పాటు- చేశారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వివరిస్తూ వీడియో ప్రదర్శించి ఆర్థిక సంఘం బృందానికి వివరించారు ఈ సందర్భంగా ప్రత్యేకంగా రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు. నేడు మీరు సాయం చేసి నిలబెడితే... రేపు దేశం సాధించే విజయాల్లో కీలకంగా ఉంటామని చెప్పుకొచ్చారు. రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని అండగా నిలవాలని 16వ ఆర్థిక సంఘాన్ని సీఎం కోరారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన 93 కేంద్ర పథకాల్లో 72 తిరిగి ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్ర పురోగతిపై ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వివరిస్తూ వీడియో ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌కు ఆర్థిక సంఘం ప్రశంసలు కురిపించింది. దీనిపై ప్రధానికి వివరించారా అని 16 ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియా ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఫోటో ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా పోలవరం ప్రాజెక్ట్, బనకచర్ల ప్రాజెక్ట్



అంశాలను ఉంచారు. అలాగే అమరావతి నిర్మాణంపై వీడియో ప్రజంటేషన్‌ను 16వ ఆర్థిక సంఘానికి చూపించారు. ఆపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం ఏ విధంగా దిగజారింది, ఏ విధంగా రాష్ట్రానికి 16వ సంఘం సాయం చేయాల్సి ఉంది అనే విషయాన్ని సీఎం వివరించారు. అలాగే కేంద్రం ఇచ్చే సాయం మరింత పెంచేలా సిఫార్సులు చేయాలని కోరారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను వారికి సీఎం వివరించినట్లు తెలుస్తోంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అందాల్సిన ప్రత్యేక సాయం వంటి అంశాలపై కూడా ఫైనాన్స్ కమిషన్ సభ్యులకు, చైర్మన్‌కు స్పెషన్ ప్రజంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులు, వడ్డీలపై 16వ ఆర్థిక సంఘానికి వివరణ ఇచ్చారు. రాష్ట్ర విభజన వల్ల వచ్చిన నష్టం.. కేంద్ర సాయంపై ప్రధానంగా సీఎం చంద్రబాబు వివరించారు... ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఏపీని ఆర్థికంగా ఆదుకోవాల్సిన పరిస్థితిపై సీఎం చంద్రబాబు ప్రెజెంటేషన్ ఇచ్చారు.. గ్రామీణాభివృద్ధి.. పంచాయితీ రాజ్.. మున్సిపల్ శాఖలకు సంబంధించి కేంద్ర ఆర్థిక సంఘం నిధులు సిఫార్సు చేయాల్సిందిగా సీఎం కోరారు.కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం చేస్తోన్న సాయంతో కొంతముందుకు వెళుతున్నా.. గతంలో చేసిన అప్పులు, వాటికి అవుతున్న వడ్డీలతో ప్రగతి రథం ముందుకు కదలడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అందాల్సిన ప్రత్యేక సాయం వంటి అంశాలపై ఫైనాన్స్ కమిషన్ బృందానికి ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇక, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలు, స్వర్ణాంధ్ర విజన్- 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు సీఎం చంద్రబాబు వివరించారు.. విభజన అనంతరం రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలు, తదనంతర పరిణామాలను వివరించారు. గత ఐదేళ్ల కాలంలో ఆర్థికంగా జరిగిన విధ్వంసం కారణంగా నేడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో కేంద్రం అదనపు సాయం చేయాలని కోరారు సీఎం చంద్రబాబు నాయుడు.. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ-సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి లోకేష్ ఈ పాల్గొన్నారు.




# వక్ఫ్ పిటిషన్లపై సుప్రీం కీలక వ్యాఖ్యలు




తాజాగా భారత సర్కారు ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం అమలుకు వ్యతిరేకంగా దాఖలైన 73 పిటిషన్లపై ఇవాళ సుప్రీం కోర్టులో విచారణ ముగిసింది. తదుపరి విచారణను రేపటి మధ్యాహ్నానికి వాయిదా వేసింది. అయితే, పిటిషన్ దార్లు కోరినట్టు వక్ఫ్ సవరణ చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. విచారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రతివాదులం దరికీ సీజేఐ(చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా) నోటీసులు జారీ చేశారు. రేపు మ.2 గంటలకు మళ్లీ విచారణ చేపడతామని.. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పాలని సుప్రీం కేంద్రాన్ని ఆదేశించింది.వక్ఫ్ బిల్లు పిటిషన్ల విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. "సుదీర్ఘకాలంగా ముస్లిం కార్యక్రమాలకు వాడుతున్న (వక్ఫ్ బై యూజర్) ఆస్తులను డినోటిఫై చేస్తే అనేక సమస్యలు తలెత్తుతాయి. వక్ఫ్ బై యూజర్ ఆస్తులను రిజిస్టర్ చేయడం కష్టం. ఇది పలు మార్లు దుర్వినియోగమైంది. అయితే నిజంగా ముస్లిం ధార్మిక కార్యక్రమాలకు ఉపయోగిస్తున్న ఆస్తులు కూడా ఉన్నాయి. హిందువుల ఆస్తులను హిందువులే నిర్వహిస్తున్నారు కదా. పార్లమెంటుకు చట్టాలు చేసే అధికారం లేదా? హిందువుల కోసం కూడా పార్లమెంట్ చట్టాలు చేస్తుంది కదా. ఢిల్లీ హైకోర్టు కూడా వక్ఫ్ భూమిలోనే ఉందని అంటున్నారు. చారిత్రక, పురావస్తు ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించడానికి వీలు లేదు' అని ధర్మాసనం తేల్చి చెప్పింది. "చాలా కాలంగా అక్కడ ఉన్న 'వక్ఫ్ బై యూజర్'లను మీరు ఎలా నమోదు చేస్తారు? వారి వద్ద ఏ పత్రాలు ఉంటాయి? అది ఏదో రద్దుకు దారితీస్తుంది. అవును, కొంత దుర్వినియోగం ఉంది. కానీ నిజమైనవి కూడా ఉన్నాయి. నేను ప్రివీ కౌన్సిల్ తీర్పులను పరిశీలించాను. 'వక్ఫ్ బై యూజర్' గుర్తించబడింది. మీరు దానిని రద్దు చేస్తే, అది సమస్య అవుతుంది" అని ప్రధాన న్యాయమూర్తి అన్నారు.పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించగా, కేంద్రప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జేపీసీ(జాయింట్ పార్లమెంటరీ కమిటీ) ద్వారా సంపూర్ణంగా అన్ని వర్గాలతో చర్చలు జరిపామని.. వక్ఫ్ అనేది కేవలం చారిటీకి సంబంధించినది మాత్రమేనని.. హిందూ ధార్మిక సంస్థలను కూడా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని తన వాదనలు కోర్టు ముందుంచారు.కాగా, కేంద్రం తెచ్చిన వక్ఫ్ చట్టం అమలును

# అమరావతిపై ఫుల్ క్లారిటీ ఇచ్చిన మంత్రి



అమరావతి, ఏప్రిల్ 16:అమరావతిపై అనవసరంగా అపోహలు సృష్టిస్తున్నారని.. అమరావతిపై లాంగ్ విజన్‌తో సీఎం చంద్రబాబు నాయుడు ఉన్నారని మంత్రి నారాయణ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అమరావతిలో పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. రైతుల భూముల విలువ పెరగాలంటే పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు రావాలంటే అదనపు భూమి అవసరం ఉంటుందని చెప్పారు. అలాగే అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఉటుందన్నారు. ఇప్పటికే భూములు ఇచ్చిన వాటి విలువ పెరగడం కోసం మరికొంత భూమి అవసరమని చెప్పుకొచ్చారు. భూసేకరణ అయితే రైతులు నష్టపోతారని.. త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఒక ఏడాది లోపే ఉద్యోగుల భవనాలు, ట్రంక్ రోడ్లు పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. అమరావతిలో విమానాశ్రయం రావాలని.. దీంతో అన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం నిర్ణయంతో ముందుకు వెళ్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.భవిష్యత్‌లో అమరావతి, గుంటూరు, తాడేపల్లి, విజయవాడ అన్నీ కలిపి మెగా సిటీగా సీఎం మాస్టర్ ప్లాన్ రూపొందించారని మంత్రి తెలిపారు. మెగా సిటీకి అంతర్జాతీయ విమానాశ్రయం అవసరమని, దాని నిర్మాణానికి ఐదువేల ఎకరాలు కావాలన్నారు. ఈ మేరకు భూమిని పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. రాజధాని నిర్మణ పనుల కోసం కావాల్సిన గ్రావెల్ కోసం అమరావతిలోని అనంతవరం గ్రామ కొండలను మంత్రి పరిశీలించారు. రాజధాని అమరావతి కోసం మరోసారి సేకరించే భూమిని భూసేకరణ ద్వారా  ద్వారా తీసుకోవాలా అనేది ఇంకా నిర్ణయం కాలేదన్నారు. భూ సేకరణ ద్వారా ఐదువేల ఎకరాలు తీసుకోవచ్చుని కానీ సేకరణ ద్వారా భూములు తీసుకుంటే రైతులు నష్టపోతారని స్థానిక ఎమ్మెల్యేలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. భూసేకరణ ద్వారా భూములు తీసుకుంటే రిజిస్ట్రేషన్ ధర కంటే రెండున్నర రెట్లు మాత్రమే ఎక్కువ వస్తుందని సమీకరణ ద్వారా అయితే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని అన్నారు. అందుకే రైతులు ఆ పద్ధతికి మొగ్గు చూపుతున్నారని తెలిపారు. 30 వేల ఎకరాలను తీసుకోవాలని అందులో రోడ్లు, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లు వేసి డ్రైయిన్‌లు కట్టాల్సి ఉంటుందన్నారు.

# సుప్రీం తదుపరి సిజెగా జస్టిజ్ బిఆర్ గవాయ్

**సిఫారసు చేసిన కొలీజియం**



న్యూఢిల్లీ,ఏప్రిల్16: భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్ నియమితులయ్యారు. కొలీజియం సిఫారసుల మేరకు ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ పేరును ప్రతిపాదించారు. వచ్చే నెల 13న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుండటంతో ఆయన స్థానంలో కొత్త ప్రధాన న్యాయమూర్తిని ప్రకటించారు. జస్టిస్ గవాయ్ మే 14న సీజేఐగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. ఆయన 1960 నవంబర్ 24న అమ్రావతిలో జన్మించారు.

# రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం

అమరావతి, ఏప్రిల్ 16: రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైన సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లను పిలిచింది. సచివాలయానికి 4 టవర్లు, హెచ్‌వోడీ కార్యాలయానికి ఒక టవర్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది సీఆర్డీఏ. హెచ్‌వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లకు టెండర్‌లను ఆహ్వానించింది. అలాగే సచివాలయం 1, 2 టవర్ల కోసం రూ.1,897 కోట్లకు, సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లతో టెండర్లు జారీ చేసింది. మొత్తం 5 టవర్లను రూ.4,668 కోట్ల వ్యయంతో చేపట్టాలని ఏపీ ప్రభుత్వం (ంఖ ఉనీలబి) నిర్ణయించింది.



మే 1న సచివాలయ, హెచ్‌వోడీ టవర్లకు టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరువనుంది.సచివాలయంలో ఉండే హెచ్‌వోడీలకు సంబంధించి 45 అంతస్థులతో ఒక టవర్ నిర్మాణం, మిగతా టవర్లు 40 అంతస్థులతో నిర్మాణం జరుగనుంది. ఈ సచివాలయం టవర్లన్నీ కూడా డయాగ్రిడ్ స్ట్రక్చర్‌తో నిర్మించాలని సీఆర్డీఏ టెండర్ షెడ్యూల్‌లో పేర్కొంది. ఈ టెండర్ రాజధాని నిర్మాణంలో సచివాలయ టవర్ల నిర్మాణమే అత్యంత కీలకమని చెప్పుకోవచ్చు. ఈ సచివాలయ టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రెండున్నర సంవత్సరాల గడువు విధించారు.ఈ రెండున్నర సంవత్సరాల్లో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకుతో పాటు, ఏడీబీ, హడ్కో, జర్మనీకి సంబంధించిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రాజధాని అమరావతిలో పలు నిర్మాణాల కోసం రూ.31వేల కోట్లు రుణాలుగా సమకూర్చాయి. ప్రపంచ బ్యాంకుకు సంబంధించి ఇప్పటికే రూ.480 కోట్లు మొదటి విడత రుణం కూడా మంజూరు అయ్యింది. ఈ మొదటి విడత రుణంతోనే సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లను పిలిచింది.

# ముందే వస్తున్నా.. సిట్‌కు విజయసాయి సమాచారం

అమరావతి, ఏప్రిల్ 16: మద్యం కుంభకోణం కేసులో  మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి  రేపు (గురువారం) ఉదయం 10 గంటలకు ఏపీ సిట్ (ంఖ ూమె)ముందు విచారణకు హాజరుకాబోతున్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఆయన సమాచారం అందించారు. విజయసాయిని తొలుత ఈ నెల 18న విచారణకు రావాలని సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమం ఉండటంతో 17వ తేదీన విచారణకు వస్తున్నానని సిట్‌కు మాజీ ఎంపీ సమాచారం పంపారు. దీంతో 17వ తేదీన విచారణకు రావాలని, తాము రెడీ అంటూ విజయసాయికి సమాచారం పంపారు సిట్ అధికారులు.మద్యం కుంభకోణం కేసులో ఏపీ సిట్ అధికారులు వేగం పెంచారు.

# సంపాదకీయం

గురువారం 17-04-2025

## ట్రంప్..తిరోగమనం...

ఏది ఏమైనప్పటికీ తమ దేశం నుంచి అధిక సుంకాలను వసూలు చేస్తున్న ప్రపంచ దేశాల నుంచి అదే స్థాయిలో టారిఫ్‌లను వసూలు చేస్తామని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ఇప్పుడు మడమ తిప్పుతున్నారు. ట్రంప్ టారిఫ్‌లు కేవలం ఆర్థిక సమస్యలతోనే కాకుండా, అంతర్జాతీయ సంబంధాలపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, యూరోపియన్ యూనియన్ వంటి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ఈ సుంకాల బారిన పడ్డాయి. ఈ దేశాలు ట్రంప్ చర్యలకు ప్రతీకార చర్యలుగా అమెరికన్ ఉత్పత్తులపై సుంకాలు విధించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితి వాణిజ్య యుద్ధాలకు దారితీసి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత బలహీనపరిచే ప్రమాదం ఉందని అంటున్నారుతొలుత ప్రపంచ వ్యాప్తంగా ఏప్రిల్ 10 నుంచి అమల్లోకి రావాల్సిన ప్రతీకార సుంకాల ఆదేశాలను 90 రోజులపాటు నిలిపివేశారు. ఆ వెంటనే టారిఫ్‌ల నుంచి 20 సెక్టార్ల ఉత్పత్తులకు మినహాయింపు కల్పించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయాలను గమనిస్తే విషయం ఇట్టే అర్థమవుతున్నదివాస్తవానికి ఇతర దేశాల నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై భారీ టారిఫ్‌లను విధించడం వల్ల తమ దేశంలో స్వదేశీ వస్తువుల కొనుగోళ్లు పుంజుకుంటాయని ట్రంప్ భావించారు. అలాగే, అమెరికాలో ఇబ్బడిముబ్బడిగా పరిశ్రమలు పుట్టుకొచ్చి, తమ పౌరులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనేది ట్రంప్ ఆలోచన. అందుకే ముందూవెనకా ఆలోచించకుండా ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను ప్రకటించేశారు. ఈ క్రమంలోనే చైనాపైనా టారిఫ్‌లు వేశారు.ట్రంప్ దెబ్బకు ఇతర దేశాలన్నీ కాళ్లబేరానికి వస్తే, చైనా మాత్రం అమెరికా అధ్యక్షుడికి దీటుగా బదులిస్తూ రావడం, దీంతో ఆ దేశంపై అమెరికా మరింత పెద్ద మొత్తంలో సుంకాలు ప్రకటిస్తూ రావడం చకచకా జరిగిపోయాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'అమెరికా ఫస్ట్ విధానంతో అనేక దేశాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధిస్తూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కలవరపెడుతున్నారు. ఈ చర్యలు అమెరికన్ ఉద్యోగాలను, స్థానిక పరిశ్రమలను కాపాడతాయని ట్రంప్ వాదిస్తున్నప్పటికీ, ఇవి గ్లోబలైజేషన్ యుగానికి ముగింపు పలుకుతున్నాయని పలు దేశాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ టారిఫ్‌లు అంతర్జాతీయ వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, దేశాలను స్థానిక ఉత్పత్తులపై ఆధారపడేలా మార్చుతున్నాయి.1991లో సోవియట్ యూనియన్ పతనం తర్వాత ప్రారంభమైన గ్లోబలైజేషన్ యుగం ఇప్పుడు ముగిసినట్లేనని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ అభిప్రాయపడ్డారు. ట్రంప్ విధించిన టారిఫ్‌లు అనేక దేశాలను తమ దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి దారితీస్తున్నాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో, అమెరికా కూడా తన స్థానిక వనరులపై ఆధారపడే అవసరం ఏర్పడుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా, భారత్, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు ఈ టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు తమ ఆర్థిక విధానాలను సవరించుకుంటున్నాయి.ట్రంప్ తన టారిఫ్ విధానాన్ని సమర్థిస్తూ, అమెరికన్ పౌరులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. విదేశీ దిగుమతులపై అధిక సుంకాలు విధించడం ద్వారా స్థానిక తయారీ రంగాన్ని ప్రోత్సహించాలని, విదేశీ ఉత్పత్తుల ఆధిపత్యాన్ని తగ్గించాలని ఆయన భావిస్తున్నారు. అయితే, ఈ చర్యలు అమెరికన్ వినియోగదారులకు వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తాయని, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. ఉదాహరణకు, చైనా నుంచి దిగుమతి అయ్యే ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విడిభాగాలపై విధించిన సుంకాలు అమెరికన్ కంపెనీల ఉత్పత్తి ఖర్చులను పెంచుతున్నాయి.రెండు దేశాల మధ్య జరిగిన సుంకాల యుద్ధం పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా మార్కెట్లపైనా ఈ ప్రభావం కనిపించింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఈ గందరగోళ పరిస్థితుల వల్ల మదుపరుల కోట్లాది సంపద ఆవిరైపోయింది. అమెరికాలో ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఆర్థికమాంద్యం ఛాయలు కనిపించాయి. ట్రంప్ వైఖరిపై ఆయన మద్దతుదారులే బహిరంగంగా పెదవి విరిచారు. దీనికి యావత్ ప్రపంచం సాక్ష్యంగా నిలిచింది. ఇంతా జరిగిన తర్వాత ట్రంప్‌కు తత్వం బోధపడినట్టు అర్థమవుతున్నది.ప్రపంచ దేశాలు ముఖ్యంగా చైనాతో పంతానికిపోతే అమెరికాకే నష్టమన్న విషయాన్ని ట్రంప్ గ్రహించినట్టు తెలుస్తున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల విషయంలో అమెరికాకు చైనా అతిపెద్ద సరఫరదారుగా ఉంది. గత ఏడాది లెక్కల ప్రకారం చైనా 88 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను, కంప్యూటర్లను అమెరికాకు ఎగుమతి చేసింది. అమెరికన్లు ఉపయోగించే ప్రతి 10 స్మార్ట్‌ఫోన్లలో నాలుగు, అలాగే ప్రతి మూడు కంప్యూటర్లలో ఒకటి చైనాలో ఉత్పత్తి అయిందే.చైనాలోనే సుమారు 80 శాతం ఐఫోన్లు ఉత్పత్తవుతున్నాయి. వీటిలో 58 శాతం అమెరికాకే ఎగుమతవుతున్నాయి. దాదాపు 8 బిలియన్ డాలర్ల విలువైన ప్లాస్టిక్ కుర్చీలను చైనా నుంచే అమెరికా దిగుమతి చేసుకుంది. అలాగే, పిల్లల ఆటవస్తువులను కూడా అగ్రరాజ్యానికి పెద్దమొత్తంలో చైనా ఎగుమతి చేస్తున్నది. ఇటువంటి తరుణంలో ఆ దేశంపై పెద్ద మొత్తంలో టారిఫ్‌లు అమలు చేస్తే అంతిమంగా అమెరికన్ల జేబులకే చిల్లు పడుతుంది.ఇప్పటికిప్పుడు అమెరికాలో ఈ వస్తువుల ఉత్పత్తి సాధ్యపడదు. అందుకే ట్రంప్ టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గినట్టు అర్థమవుతున్నది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, చిప్‌లు, సోలార్‌సెల్, మెమోరీకార్డులు వంటి ఉత్పత్తులను టారిఫ్‌ల నుంచి అమెరికా మినహాయించింది.


# ట్రంప్ ఎఫెక్ట్... మేకిన్ ఇండియాకు లైఫ్...

ముంబై, ఏప్రిల్ 16,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్విధిస్తున్న కొత్త సుంకాలతో ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన వ్యక్తమైంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా కుప్ప కూలే పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో ట్రంప్ సుంకాల అమలును మూడు నెలలు వాయిదా వేశారు. అయితే చైనాపై మాత్రం సుంకాలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇదే ఇప్పుడు భారత తయారీ రంగానికి బూస్ట్‌గా మారింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త సుంకాలు (టారిఫ్‌లు) చైనా ఉత్పత్తులపై భారీగా ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత తయారీ రంగానికి అనూహ్యమైన అవకాశాలు ఏర్పడుతున్నాయి. చైనాపై అధిక సుంకాలతో పోలిస్తే, భారత్‌పై సాపేక్షంగా తక్కువ సుంకాలు విధించడం ద్వారా భారత్‌కు ట్రంప్ ఒక రకంగా గొప్ప రాజకీయ, ఆర్థిక అవకాశాన్ని అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని భారత్‌సద్వినియోగం చేసుకుంటే, తయారీ రంగంలో చైనాకు గట్టి పోటీ ఇచ్చే స్థాయికి చేరే అవకాశం ఉంది.ఇటీవల ఒకే రోజు మూడు కార్గో విమానాలు భారత్‌లో తయారైన ఐఫోన్‌లతో అమెరికాకు బయలుదేరిన వార్త దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించింది. ట్రంప్ కొత్త సుంకాలు అమల్లోకి రాకముందే ఈ ఉత్పత్తులను అమెరికాకు చేర్చేందుకు ఆపిల్ సంస్థ వేగంగా వ్యవహరించింది. గత కొన్ని సంవత్సరాలుగా భారత్‌లో ఐఫోన్‌ల తయారీని ఆపిల్ విస్తరిస్తోంది. ప్రస్తుతం, ఆపిల్ ఉత్పత్తిలో 10?15% భారత్‌లో జరుగుతోంది, మరియు దీనిని 2025 నాటికి 25%కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.చైనాపై 104% సుంకాలు విధించిన ట్రంప్, భారత్‌పై కేవలం 26% సుంకాలు నిర్ణయించారు. దీనివల్ల చైనాలో తయారైన ఐఫోన్‌లతో పోలిస్తే, భారత్‌లో ఉత్పత్తి చేసిన ఐఫోన్‌లు అమెరికా మార్కెట్‌లో ధర పరంగా గణనీయంగా పోటీదారుగా నిలుస్తాయి. ఒక ఐఫోన్ తయారీ ఖర్చు 450 డాలర్లు అనుకుంటే, చైనాలో ఉత్పత్తి చేస్తే సుంకాలతో కలిపి అమెరికాలో దాని ధర 918 డాలర్లకు చేరుతుంది, అయితే భారత్‌లో తయారైనది కేవలం 567 డాలర్లకే అందుబాటులో ఉంటుంది. ఈ ధరల వ్యత్యాసం ఆపిల్‌ను భారత్‌లో ఉత్పత్తిని విస్తరించేలా ప్రోత్సహిస్తోంది.చైనా?అమెరికా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇరు దేశాలు ఒకరిపై ఒకరు అధిక సుంకాలు విధిస్తూ, వాణిజ్య ఆంక్షలను కఠినతరం చేస్తున్నాయి. ఈ పరిస్థితి చైనా ఉత్పత్తులకు అమెరికా మార్కెట్‌లో డిమాండ్‌ను గణనీయంగా తగ్గిస్తోంది. ఈ ఖాళీని భర్తీ చేయడానికి భారత్ అనువైన గమ్యస్థానంగా మారుతోంది.కరోనా మహమ్మారి తర్వాత, చైనాపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు 'చైనా+1' వ్యూహాన్ని అనుసరించాయి. ఈ వ్యూహంలో భాగంగా, భారత్‌లో తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపాయి. అయితే, ఊహించిన స్థాయిలో ఈ అవకాశాలను భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయిందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పుడు, ట్రంప్ సుంకాల విధానం ద్వారా భారత్‌కు కొత్త అవకాశాలు తలుపులు తెరుస్తోంది. ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, ఆటోమొబైల్ భాగాలు, మరియు ఇతర తయారీ రంగాల్లో భారత్ ఈ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.ట్రంప్ సుంకాలు భారత్‌కు అవకాశాలను తెచ్చిపెట్టినప్పటికీ, కొన్ని సవాళ్లు కూడా ఎదురవుతాయి. భారత్‌పై విధించిన 26% సుంకాలు, చైనాతో పోలిస్తే తక్కువైనప్పటికీ, ఇతర ఆసియా దేశాలైన జపాన్(24%) మరియు దక్షిణ కొరియా (25%)తో పోలిస్తే ఇది ఎక్కువే. ఈ సుంకాలు భారత ఎగుమతులపై కొంత ప్రభావం చూపవచ్చు, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, ఆభరణాలు, మరియు ఇంజనీరింగ్ వస్తువుల వంటి రంగాల్లో. అయినప్పటికీ, భారత్‌కు ప్రస్తుతం ఉన్న సాపేక్ష ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవడానికి కొన్ని కీలక చర్యలు అవసరం.మౌలిక సదుపాయాల అభివృద్ధి: తయారీ కేంద్రాల స్థాపనకు అనువైన లాజిస్టిక్స్, విద్యుత్ సరఫరా, మరియు రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలి.వ్యాపార సౌలభ్యం: విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బిజినెస్ ఈజ్ ఆఫ్ డూయింగ్‌ను మెరుగుపరచడం ద్వారా, అడ్మినిస్ట్రేటివ్ ఆటంకాలను తగ్గించాలి.ప్రోత్సాహకాల విస్తరణ: ప్రస్తుతం ఉన్న ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాలను మరింత విస్తరించి, ఎక్కువ రంగాలను చేర్చాలి.నైపుణ్య శిక్షణ: తయారీ రంగంలో అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు శిక్షణా కార్యక్రమాలను బలోపేతం చేయాలి.భారత ప్రభుత్వం చొరవ: ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో భారత ప్రభుత్వం చొరవ కీలక పాత్ర పోషిస్తుంది. గతంలో చైనా+1 వ్యూహంలో భాగంగా వచ్చిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోయిన నేపథ్యంలో, ఇప్పుడు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తును నిర్ణయిస్తాయి. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చర్చలను వేగవంతం చేయడం, విదేశీ సంస్థలకు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను అందించడం, పెంచడం వంటి చర్యలు అత్యవసరం. అదే సమయంలో, చైనా ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా భారత్‌ను ఎంచుకునే సంస్థలు, దీర్ఘకాలికంగా ఇక్కడే పెట్టుబడులు పెట్టేలా చూడాలి. ఇందుకోసం, భారత్ తన ఆర్థిక విధానాలలో స్థిరత్వాన్ని కొనసాగించాలి. తద్వారా భారత్ తయారీ రంగంలో కొత్త శకాన్ని ప్రారంభించవచ్చు.

# నోరు తెస్తున్న తంటా...

హైదరాబాద్, ఏప్రిల్ 16, )బీఆర్ఎస్ నేతలు నోరు పారేసుకుంటున్నారు. వాళ్లు చేసే వ్యాఖ్యలతో పార్టీ పరువును దిగజారుస్తున్నారు. ప్రజల్లో మరింత పలుచన అవుతున్నారు. రాజకీయ విమర్శలు చేయడం వరకూ ఓకే కానీ, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని పడగొడతామని చేస్తున్న వ్యాఖ్యలు ఆ పార్టీని మరింత డ్యామేజీ చేస్తాయని చెప్పక తప్పదు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ అప్పులు చేయడం మినహా ఏం చేసిందని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రాజెక్టుల పేరుతో కోట్లాది రూపాయలు దోచుకోవడం మినహాయించి పేద ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. అలాంటి బీఆర్ఎస్ నేతలు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ను కూలదోసేందుకు ప్రయత్నాలు చేయడం ఎంత వరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. కవిత వార్నింగ్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదట్లోనే... గతంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి రావడానికి రెడీ గా ఉన్నారని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటి నేతలు చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కాక పుట్టించాయి. కట్ చేస్తే బీఆర్ఎస్ కు చెందిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపునకు వెళ్లడం చూశాం. ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే చేసిన ఈ వ్యాఖ్యలు ప్రజా తీర్పును అగౌరవపర్చే విధంగా ఉన్నాయి. అప్పట్లోనే అనేకమంది ఈ వ్యాఖ్యలను తప్పుపట్టారు. తాజాగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారాయి. అయితే ఆయన చేసిన వ్యాఖ్యలు రియల్టర్లకు, వ్యాపారులకు అండగా నిలిచేటట్లు ఉన్నాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేయాలని వ్యాపారులు, రియల్టర్లు కోరుకుంటున్నారని, అవసరమైతే ప్రభుత్వాన్ని కూల్చి వేయడానికి తాము ఆర్థిక సహకారం అందిస్తామని చెప్పారని కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మంట రేపుతున్నాయి. కేసీఆర్ ఆత్మగా భావించే కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వంపై కుట్ర జరగుతుందనడానికి నిదర్శనమని అన్నారు. మంత్రి వర్గ విస్తరణ జరిగితే ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమని మరో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కూడా వ్యాఖ్యానించారు. అంటే రియల్టర్లకు, వ్యాపారులకు ప్రభుత్వభూములను అప్పగించి వారి వద్ద నుంచి డబ్బులు దండుకోవడానికి బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ జిల్లాల్లో వర్షాలుబి : పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు... దీంతో కొత్త ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నేతలు తొగుట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అయితే కాంగ్రెస్ నేతలు వరసపెట్టి కౌంటర్లు ఇవ్వడంతో పాటు ప్రజల్లో కూడా ఒకరకమైన కొత్త ప్రభాకర్ రెడ్డి మాట మార్చారు. తనను అడ్డుకున్నా, తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షలకు కూడా సిద్ధమని కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. తాను అన్న మాటలను వక్రీకరించి చెబుతున్నారని అన్న ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు విసుగు చెందుతున్నారని అన్నారు. కొత్త ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజానిజాలు ఎంత ఉన్నప్పటికీ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రజాతీర్పును పక్క దోవ పట్టించే విధంగా ఉన్నాయన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. ఇలాగే జరిగితే కారు గ్యారేజీకే పరిమితమవుతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి

# మే 15 నుంచి సరస్వతి పుష్కరాలు




హైదరాబాద్, ఏప్రిల్ 16,తెలంగాణలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతీ నది పుష్కరాలకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పుష్కరాల కోసం దేవాదాయ శాఖ రూ.25 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. పుష్కరాలకు లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున వారి కోసం స్నాన ఘట్టాల నిర్మాణం, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. 2025 మే 15న సూర్యోదయంతో పుష్కర పుణ్యస్నానాలు ప్రారంభమవుతాయి.. మే 26 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఏడాదికి ఓ నదికి పుష్కరాలు వస్తాయ్. 2025లో సరస్వతీ నదికి పుష్కరాలొస్తున్నాయ్.పూర్వం పుష్కరుడు అనే బ్రాహ్మణుడు శివుడి కోసం తపస్సు ఆచరించాడు. భక్తికి మెచ్చి ప్రత్యక్షమైన శివుడు ఏదైనా వరం కోరుకోమని అడిగాడు. ఓ దేవా జీవులు చేసిన పాపాలతో నదులన్నీ అపవిత్రమవుతున్నాయి. నదులు పునీతమైతే ప్రజలు సుభిక్షంగా ఉంటారు ఆ శరీర స్పర్శతో నదులు పునీతం అయ్యేలా వరం ఇమ్మని అడిగాడు. నువ్వు ఏ నదిలోకి ప్రవేశిస్తే ఆ నది పునీతం అవుతుందనే వరం ఇచ్చాడు శివుడు. అలా పుష్కరుడు ఏడాదికి ఓనదిలో ప్రవేశిస్తాడు. అది కూడా బృహస్పతి రాశి మారిన సమయంలో. ఏడాదికి ఓ రాశిలోకి పరివర్తనం చెందుతాడు బృహస్పతి. మొదటి 12 రోజులను ఆది పుష్కరాలుగా, చివరి 12 రోజులను అంత్య పుష్కరాలుగా నిర్వహిస్తారు. బృహస్పతి ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు క్రమ పద్ధతిలో పుష్కరాలు జరిగేలా రూపొందించారు పండితులు. గురువు మేష రాశిలో ప్రవేశించినప్పుడు గంగానదికి, వృషభ రాశిలో ప్రవేశి స్తే నర్మదానది, మిథునంలో ప్రవేశిస్తే సరస్వతి, కర్కాటకంలో ఉన్నప్పుడు యమునానది, సింహరాశిలో ప్రవేశిస్తే గోదావరి నదికి..ఇలా ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కో నదికి పుష్కరాలు జరుగుతాయి. అలా ఈ ఏడాది సరస్వతీ నది పుష్కరాలు మే 15 నుంచి 26 వరకు జరుగుతాయిముక్తీశ్వర లింగానికి వున్న నాసిక రంధ్రాల గుండా ఎంత నీరు పోసినా బయటికి రాకుండా భూమార్గంలో ప్రవహించి సరస్వతి నదిరూపంలో గోదావరి, ప్రాణహిత నదులతో కలిసి త్రివేణి సంగమంగా ఏర్పడిందని చెబుతారు. అందుకే సరస్వతీ నదికి గుప్త కామినీ అనే మరో పేరుంది. కాశీ క్షేత్రంలానే కాళేశ్వరం కూడా పిండ ప్రదానానికి ముఖ్యమైన క్షేత్రం అని చెబుతారు. కాశీ కి వెళ్ల లేని వాళ్ళు ఇక్కడ గోదావరి-ప్రాణహిత-సరస్వతి నదుల త్రివేణి సంగమ స్థానంలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

# మే 1 నుంచి 15 బ్యాంకుల విలీనం

న్యూడిల్లీ, ఏప్రిల్ 16, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, గుజరాత్, జమ్మూ మరియు కాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిస్సా మరియు రాజస్థాన్ రాష్ట్రాలలో దీని ప్రభావం కనిపించనుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో మే ఒకటి నుంచి ఒక రాష్ట్రం ఒక ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు అనే విధానం అమలులోకి రానుంది. తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదన ప్రకారం 11 రాష్ట్రాలలో 15 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల విలీనం కోసం ఒక నోటిఫికేషన్ను విడుదల చేసింది. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఏకీకరణలో ఈ విలీనం నాలుగవ దశ అని తెలుస్తుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా రీజినల్ రూరల్ బ్యాంక్ ల సంఖ్య 43 నుండి 28కి తగ్గనుందని తెలుస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తో పాటు అనేక ప్రభుత్వ బ్యాంకులతో ఈ బ్యాంకులు అనుబంధంగా ఉన్నాయి. ముఖ్యంగా ఇవి గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలను మరింత బలోపేతం చేస్తాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం దీని ప్రభావం మొత్తం దేశంలోని 11 రాష్ట్రాలలో కనిపించబోతుంది. ప్రస్తుతం ఈ రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో ఒకే సంస్థగా త్వరలో విలీనం కానున్నాయి.ఈ విధంగా తాజాగా ప్రభుత్వం ఒక రాష్ట్రం ఒక రీజినల్ రూరల్ బ్యాంకు లక్ష్యాన్ని సాధించవచ్చు.వీటి విలీనం కోసం మే 1, 2025 గా నిర్ణయించడం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంకు స్పాన్సర్ చేసిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు అలాగే ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మరియు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ విలీనం అయ్యి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా మే 1 నుంచి ఏర్పడతాయి. అలాగే ఉత్తరప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాలలోని మూడు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు ఒకే సంస్థగా విలీనం కాబోతున్నాయి.ఉత్తరప్రదేశ్లో ఉన్న బరోడా యూపీ బ్యాంకు, ఆర్య వర్క్ బ్యాంకు, ప్రథమ యుపి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఉత్తరప్రదేశ్ గ్రామీణ బ్యాంకు గా ఏర్పడనున్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో దీని ప్రధాన కార్యాలయం లక్నోలో ఉంటుందని సమాచారం. అదేవిధంగా బంగీయ గ్రామీణ వికాస్ బ్యాంక్ మరియు పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంక్, ఉత్తర్భాంగ్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి పశ్చిమ బెంగాల్ గ్రామీణ బ్యాంకును పశ్చిమ బెంగాల్లో ఏర్పాటు చేయనున్నారు.

# కాంగ్రెస్ నేతలపై ఈడీ చార్జిషీట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలకు ఈడీ షాకిచ్చింది. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఛార్జ్‌షీట్‌ను విచారించాలా లేదా అన్న విషయంపై ఈనెల 25వ తేదీన కోర్టు నిర్ణయిం తీసుకుంటుంది. ఇప్పటికే ఢిల్లీ , లక్నో , ముంబై లోని నేషనల్ హెరాల్డ్ ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు ఇచ్చింది. రూ. 700 కోట్ల ఆస్తులను సీజ్ చేయడానికి నోటీసులు అంటించారు.నేషనల్ హెరాల్డ్ కేసులో 2021 నుంచి ఈడీ విచారణ జరుగుతోంది. ఛార్జ్‌షీట్‌లో కాంగ్రెస్ సీనియర్ నేతలు సుమన్ దూబే , శ్యామ్ పిట్రోడా పేరును కూడా చేర్చారు. సోనియా, రాహుల్‌పై మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేశారు. యంగ్ ఇండియా కంపెనీతో రూ.2000 కోట్ల నేషనల్ హెరాల్డ్ ఆస్తులను లాక్కునే కుట్ర జరిగిందని ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ న్యాయ సలహాలను తీసుకుంటోంది. నేషనల్ హెరాల్డ్ కేసు డైయిరీ వివరాలు ఇవ్వాలని ఈడీని కోర్టు ఆదేశించింది. ఈడీ ఛార్జ్‌షీట్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాని మోదీ , అమిత్‌షా బెదిరింపు రాజకీయాలకు ఇది నిదర్శనమన్నారు కాంగ్రెస్ నేత జైరాం రమేశ్. కాంగ్రెస్ నాయకత్వం ఈ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఆస్తుల స్వాధీనం పెద్ద కుట్ర అని ఆరోపించారు.మరోవైపు గుర్‌గ్రామ్ భూముల కేసులో ఈడీ విచారణకు హాజరయ్యారు ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రా. గతంలో గురుగ్రామ్‌లో మూడున్నర ఎకరాల భూమిని రాబర్ట్ వాద్రా ఏడున్నర కోట్ల రూపాయలకు కొని, 58 కోట్లకు ఆఒఈకు అమ్మేశారు. ఈ వ్యవహారంలో 51 కోట్ల రూపాయల లబ్ధి వాద్రాకు చేకూర్చినట్లు ఇఆ ఆరోపించింది. ఈ కేసులో ఈనెల 8న విచారణకు గైర్హాజరయ్యారు వాద్రా. దీంతో మరోసారి నోటీసులు జారీ చేశారు ఈడీ అధికారులు. రాజకీయ ప్రతీకారంతోనే తనపై కేసు పెట్టారని వాద్రా ఆరోపించారు. ప్రజల తరపున నేను మాట్లాడిన ప్రతీసారి తన గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఇఆ అడిగిన అన్ని ప్రశ్నలకు జవాబులు చెప్పినట్టు తెలిపారు.

# తుంగతుర్తి ఎస్సీ బాలికల హాస్టల్ లో ఏసీబీ సోదాలు

సూర్యాపేట,తుంగతుర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో అవకతవకలపై ఏసీబీ అధికారులు విచారణ ప్రారంభించారు. విచారణ వివరాలను ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్ మీడియా ముందు వెల్లడించారు. హాస్టల్లో అవకతవకలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో ఆకస్మిక తనిఖీ చేశాం. హాస్టల్ అడ్మిషన్ లో 51 విద్యార్థులను రిజిస్టర్ చేసి 25 మందికి భోజనం అందిస్తున్నారు. వసతి గృహంలో వార్డెన్, సిబ్బంది విద్యార్థులకు అందుబాటులో ఎల్లవేళలా ఉండాలి. అడ్మిషన్ రిజిస్టర్ సరిగా లేదు. మొత్తం అస్తవ్యస్తంగా ఉంది. విద్యార్థులకు అందించే భోజన వసతులు సరిగా లేవు. వసతి గృహానికి సంబంధించిన రిజిస్టర్లు, మెయింటెన్ రిజిస్టర్లు లేవు. వసతి గృహంలో వార్డెన్ మార్తమ్మ విధుల పట్ల నిర్లక్ష్యం వహించారని అన్నారు. -ప్రభుత్వ ఉద్యోగులు చేయవలసిన పనులకు డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీనెంబర్ 1064కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయి. వార్డెన్ మార్తమ్మపై విచారణ పూర్తి చేసి తగు చర్యల నిమిత్తం ఏసీబీ డీజీపీకి నివేదికను పంపుతామని అన్నారు.

# ముఖం చాటేస్తున్న మంత్రులు

హైదరాబాద్, ఏప్రిల్ 16, కాంగ్రెస్ మంత్రులు గాంధీభవన్ ముఖం చూడటమే మానేశారు. ప్రతివారం ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌లో పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారని ప్రకటించిన షెడ్యూల్ మూడు రోజుల ముచ్చటగా మిగిలింది. ప్రజా సమస్యలు తెలుసుకొని పరిష్కార మార్గం చూపాల్సిన మంత్రులు గాంధీభవన్‌కు రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఇటు కార్యకర్తలు అటు ప్రజలు గాంధీభవన్ చుట్టూ తిరుగుతూ ఇబ్బది పడాల్సి వస్తోందంట.. అసలు మంత్రుల షెడ్యూల్‌లో మార్పులు ఎందుకు వచ్చాయి? మళ్ళీ గాంధీభవన్‌కి మంత్రుల వస్తారా? పార్టీ వర్గాల్లో దానిపై జరుగుతున్న చర్చేంటి?ప్రజా పాలనలో ప్రజల సమస్యలు తెలుసుకోవాలి, ప్రజలకు దగ్గర కావాలి, ప్రజల సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో వారానికి ఇద్దరు మంత్రులు గాంధీభవన్‌లో అందుబాటులో ఉండేలా కాంగ్రెస్ పెద్దలు షెడ్యూల్ రూపొందించారు. సచివాలయంలో మంత్రులు తమ డిపార్ట్‌మెంట్ పనులతో బిజీబిజీగా ఉంటారు. కాబట్టి ప్రజలు సచివాలయానికి వెళ్ళినా మంత్రులను కలిసే అవకాశం పెద్దగా ఉండదు . సమస్యలు తెలుసుకునే అవకాశం ఉ ండదు.అందుకే మంత్రులను కలిసే వెసులుబాటు ఉండాలి, ప్రజల సాధక బాధకాలు చెప్పుకునే సౌలభ్యం ఉండాలనే ఉద్దేశంతో గాంధీభవన్లో వారానికి ఇద్దరు మంత్రులు అందరికీ అందుబాటులో ఉంటారని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటించారు. వారంలో ఇద్దరు మంత్రులు పక్కాగా గాంధీభవన్‌కు వస్తారు,ప్రజల సమస్యలు తెలుసుకుంటారు, ప్రజలిచ్చే అర్జీలను తీసుకుంటారు, సమస్యలను పరిష్కరిస్తారనే ఉద్దేశంతో గాంధీభవన్‌లో ఆయన మంత్రుల ప్రోగ్రామ్స్ ను ఏర్పాటు చేశారు.వారంలో ప్రతి బుధవారం, శు క్రవారం గాంధీభవన్‌లో మంత్రులు అందుబాటులో ఉంటారని పీసీసీ ఛీఫ్ షెడ్యూల కూడా ఖరారు చేశారు. దానికి తగ్గట్లే ఆరంభంలో కొన్ని వారాలు వారానికి ఇద్దరు చొప్పున మంత్రులు వచ్చారు ప్రజల సమస్యలను విన్నారు. అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులు, అదేవిధంగా జిల్లా కలెక్టర్లతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మొదట్లో వారానికి ఇద్దరు మంత్రులు వచ్చేవారు. అది కాస్త తర్వాత వారానికి ఒకే మంత్రి అయ్యారు. మంత్రులు వచ్చినప్పుడు గాంధీభవన్‌కు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకొని తమ ఇబ్బందులు చెప్పుకునేవారు. మంత్రులు వాటి పరిష్కారానికి చొరవ తీసుకోవడంతో గాంధీభవన్ కి వెళ్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడింది.తీరా చూస్తే కొన్ని వారాల నుండి మంత్రులు గాంధీభవన్‌కు రావడం లేదు. పీసీసీ అధ్యక్షుడు కూడా మంత్రులను గాంధీభవన్ కి తీసుకువచ్చే అంశంపై సీరియస్‌గా దృష్టి పెట్టడం లేదనే చర్చ జరుగుతుంది. స్వయంగా తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయనే ఉద్దేశంతో కార్యక్రమం మొదలుపెడితే.. కొద్ది కాలంగా మంత్రులు గాంధీభవన్‌కు రాకపోతుండటంతో ప్రజలు కూడా అటు వైపు రావడం మానేస్తున్నారు. ఇక సమస్యలు చెప్పుకుందామని సచివాలయానికి వెళ్తూ తమ శాఖల పనుల మీద మంత్రులు బిజీగా ఉంటున్నారంట. లేకపోతే సంబంధిత మంత్రులు ప్రజలు వెళ్లిన సమయంలో అందుబాటులో ఉండడం లేదంట. కొన్ని సందర్భాల్లో మంత్రులు ఉన్నా మంత్రుల సిబ్బంది తమను కలవనీయకుండా అడ్డుకుంటున్నారని జనం విమర్శిస్తున్నారు.ఓ వైపు గాంధీభవన్ కు మంత్రులు రాకపోవడం.. మరోవైపు సచివాలయంకి వెళ్తే మంత్రులు దొరకకపోవడంతో.. సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారట. గాంధీభవన్‌కు మంత్రులు వచ్చేలా మరోసారి పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ చొరవ తీసుకొని, రెగ్యులర్‌గా వారానికి రెండు రోజులు మంత్రులు అందుబాటులో ఉండేలా చూస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా నెలారెండు నెలలకు ఒకసారైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాంధీభవన్ కు వచ్చేలా మహేష్ కుమార్ గౌడ్ చొరవ చూపితే ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కారం అవుతాయని రాజకీయ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది.మొత్తానికి గాంధీభవన్‌కు మంత్రుల షెడ్యూల్ తప్పడంతో?కాంగ్రెస్ ఏ పని తలపెట్టినా ఆరంభ శూరత్వమే అవుతుందనే చర్చ పొలిటికల్ సర్కిల్లో జరుగుతుంది. మరి గాంధీభవన్ కు మళ్లీ మంత్రులను రప్పించి ఆ విమర్శలను పీసీసీ చీఫ్ తిప్పికొడతారా? కొన్ని వారాలుగా గాంధీభవన్‌లో దర్శనమివ్వని మంత్రులు మళ్లీ రీ ఎంట్రీ ఇస్తారా? అన్నది చూడాలి.

# ఉద్యోగులకు ఇంకా అందని జీతాలు

హైదరాబాద్, ఏప్రిల్ 16, తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాల చెల్లింపులో ఆలస్యం అవుతోంది. ఫలితంగా చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు బ్యాంక్ ఈఎంఐలు కట్టడానికి ప్రైవేట్ ఫైనాన్సర్ల దగ్గర అధిక వడ్డీకి డబ్బులు తెచ్చుకుంటున్నారు. గత పదేళ్లుగా జీతాలు రావడం చాలా ఆలస్యం అవుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని.. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఖర్చులకు సరిపోవడం లేదని, దీనివల్ల జీతాలు చెల్లించడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఇటు ఎన్నికల హామీలను నెరవేర్చడానికి, సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాల్సి రావడంతో ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగింది.గతంలో ప్రభుత్వం తీసుకున్న భారీ రుణాల వల్ల ఇప్పుడు వాటి వాయిదాలు, వడ్డీలు చెల్లించాల్సి వస్తోంది. ఇది రాష్ట్ర ఖజానాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రైతు రుణమాఫీ, ఇతర పథకాల కోసం తీసుకున్న రుణాలు చెల్లింపులకు ఆటంకం కలిగిస్తున్నాయికొన్నిసార్లు కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఆలస్యం అవుతున్నాయి. ఇది కూడా ఉ ద్యోగుల జీతాల చెల్లింపుపై ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు..రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య పెరగడం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్లు చెల్లించాల్సి రావడంతో.. జీతభత్యాల కోసం ఎక్కువ నిధులు అవసరమవుతున్నాయి. ఇటీవల పదవీ విరమణ వయస్సు పెంచినప్పటికీ, రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పదవీ విరమణ చేయనుండటంతో పెన్షన్ల భారం మరింత పెరిగే అవకాశం ఉ ంది.ఉద్యోగులకు వేతన సవరణ (ఖఖీఅ), కరువు భత్యం (ఆం) పెంపుదల వంటి అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని అమలు చేస్తే జీతాల చెల్లింపులకు మరింత ఎక్కువ నిధులు అవసరమవుతాయి. ఇది రాష్ట్ర ఖజానాపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది.కొన్నిసార్లు నిధుల నిర్వహణలో సరైన ప్రణాళిక లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల కూడా జీతాల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి ప్రయత్నిస్తోంది. ఉ ద్యోగులకు జీతాలు సకాలంలో చెల్లించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఉద్యోగులకు అన్ని వాస్తవాలు తెలియజేసి, ఆర్థిక పరిస్థితులపై వారితో చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఇటీవల తెలిపారు.జూన్ 2021 నాటి సమాచారం ప్రకారం.. తెలంగాణలో దాదాపు 9.21 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఇందులో రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పెన్షనర్లు ఉ న్నారు..తెలంగాణలో విద్యాశాఖ, హోంశాఖ, వైద్యారోగ్య శాఖ, రెవెన్యూ శాఖల్లో ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. ఈ శాఖల ఉద్యోగుల జీతాల కోసం ఎక్కువ నిధులు ఖర్చు అవుతున్నాయి.

# కాక రేపుతున్న మంత్రి పదవులు

హైదరాబాద్, ఏప్రిల్ 16, కేబినెట్ విస్తరణ తెలంగాణ కాంగ్రెస్‌లో కాక రేపుతోంది. మంత్రి పదవులపై లుకలుకలు మొదలయ్యాయి. మాకంటే మాకంటూ కేబినెట్ బెర్త్ కోసం కర్చీఫ్ వేస్తున్నారు ప్రముఖులంతా. ఉగాదికే జాబితా వస్తుందనుకుంటే.. అది కాస్తా ఆలస్యం అవుతుండటంతో రచ్చ రాజుకుంటోంది. ఆ ఉక్కబోత భరించలేక ఆశావహులు ఒక్కొక్కరిగా నోరు జారుతున్నారు. బహిరంగంగానే బయటపడుతున్నారు. ఇప్పటికే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. మాజీ మంత్రి జానారెడ్డిని టార్గెట్ చేయగా.. లేటెస్ట్‌గా ప్రేమ్ సాగర్ రావు.. ఓ కుటుంబాన్ని కార్నర్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్‌లో కలకలం రేపారు.మంత్రి పదవిని అడ్డుకుంటూ.. తన గొంతు కోసేందుకు ఓ కుటుంబం ప్రయత్నిస్తోందంటూ ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గొంతు కోస్తే ఊరుకోబోనని.. కుటిల యత్నాలను తిప్పికొడతానని హెచ్చరించారు. పార్టీని కష్టకాలంలో కాపాడిన వారికి అవకాశాలు కల్పించాలని.. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేయవద్ద న్నారు. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. ప్రేమ్ సాగర్ రావు టార్గెట్ చేసింది ఎవరిననే చర్చ జరుగుతోంది తెలంగాణలో.రాజగోపాల్‌రెడ్డి గురించే ప్రేమ్‌సాగర్ అలా అన్నారని కొందరు అంటున్నా.. అది కరెక్ట్ కాదని తెలుస్తోంది. ఆయన మాట్లాడింది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల గురించేనని చెబుతున్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామినే తన మంత్రి పదవికి చెక్ పెడుతున్నారనేది ప్రేమ్ సాగర్ వ్యాఖ్యల అంతరార్థం అంటున్నారు. వివేక్‌తో పాటు కుటుంబంలో ఆయన సోదరుడు వినోద్ కూడా ఎమ్మెల్యేగా ఉన్నారు. కొడుకు వంశీ.. ఎంపీగా కొనసాగుతున్నారు. వివేక్ గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. ఆ తర్వాత బీజేపీకి మారారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉ న్నారు. అందుకే ఆయన్ను టార్గెట్ చేస్తూ.. అన్ని పార్టీలు తిరిగి వచ్చిన వారు మంత్రి పదవి అడుగుతున్నారంటూ కామెంట్స్ చేశారు. ఉమ్మడి జిల్లా కోటాలో కేబినెట్ రేసులో ప్రేమ్ సాగర్‌కు వివేక్ నుంచి పోటీ ఉంది. ఆ ఫ్యామిలీ గుత్తాధిపత్యం కోసమే.. తన కేబినెట్ బెర్త్ కన్ఫామ్ కాకుండా అడ్డుకుంటున్నా రనేది ప్రేమ్ సాగర్ రావు అక్కసుగా తెలుస్తోంది.పెద్దలు జానారెడ్డిని రాజగోపాల్‌రెడ్డి టార్గెట్ చేసిన మరుసటి రోజే ప్రేమ్ సాగర్ రావు సైతం బహిరంగ ఆరోపణలు చేయడం కాంగ్రెస్ పార్టీలో కాస్త కుదుపు వచ్చినట్లైంది. కేబినెట్ విస్తరణ లేట్ అవుతున్నా కొద్దీ.. ఇలాంటి పరిస్థితులే తలెత్తుతాయని.. అందుకే వీలైనంత తొందరగా ఆ పని పూర్తి చేయాలని అధిష్టానానికి మెసేజ్‌లు వెళ్తున్నాయట. నల్గొండలో రాజగోపాల్‌రెడ్డి బలమైన నాయకుడు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ్ సాగర్ రావు తిరుగులేని నేత. వారికి మంత్రి పదవులు ఇవ్వడంపై పార్టీ పెద్దలెవరికీ అభ్యంతరం ఉండకపోవచ్చు. జానారెడ్డి ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన కుమారుడు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ఈయన్ను అడ్డుకోవడం అనేది టీ కప్పులో తుఫాను లాంటి వివాదమే తప్ప అంత పెద్దగా చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. ఆదిలాబాద్‌లో మాత్రం ప్రాబ్లమ్ కాస్త సీరియస్ గానే ఉన్నట్టుంది. ప్రేమ్ సాగర్ రావు ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉన్నారు. ఆయన్ను సంతృప్తి పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇంకా ఎవరికీ మంత్రి పదవి దక్కలేదు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, చెన్నూర్ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లు మంత్రి పదవుల రేసులో ఉన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు దాదాపు 14 సంవత్సరాలుగా పార్టీని అంటి పెట్టుకుని ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో అందరూ కాంగ్రెస్ పార్టీని వీడిపోయినా ఆయన మాత్రం పార్టీ కోసం ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ సజీవంగా ఉందంటే అది ప్రేంసాగర్‌రావు కృషి వల్లనే అని కాంగ్రెస్ క్యాడర్ భావిస్తారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 66వేలకుపైగా భారీ మెజార్టీతో విజయం సాధించారు. కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు ప్రధానంగా గడ్డం వివేక్ నుంచి పోటీ వస్తోంది. ఆయన ఎస్సీ నేత కావడంతో ప్లస్ గా మారింది. అయితే పలుమార్లు పార్టీ మారి వచ్చారు. ఖానాపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలచిన వెడ్మ బొజ్జు కూడా గిరిజన కోటాలో తనకు పదవి వరిస్తుందనే ఆశతో ఉన్నారు.సామాజిక సమీకరణాలతో తన సీనియార్టీని.. పార్టీకి చేసిన సేవలను గుర్తించకపోతే ఊరుకునేది లేదని ప్రేమ్ సాగర్ రావు బహిరంగంగానే చెబుతున్నారు. మరో వైపు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని అంటున్నారు. తనకు పదవి రాకుండా.. చేసేందుకు జానారెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తున్నారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు అయిపోయిందని అనుకులోనేలోపే కొత్త కొత్త అడ్డంకులు వచ్చేశాయి. ఉ గాది రోజున సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్ ను కలవడంతో మూడో తేదీన మంత్రి వర్గ విస్తరణ ఉంటుం దని అందరూ మానసికంగా రెడీ అయిపోయారు. ఎవరెవరికి బెర్తులన్న దానిపై కాంగ్రెస్ లో చర్చోపచర్చలు జరిగాయి. కానీ ఆ మూడో తేదీ దాటి పది రోజులు అయినా హైకమాండ్ నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదు. ఈ లోపు పార్టీ నేతుల ఎవరికి వారు పదవులు ఇవ్వాల్సిం దేనన్న డిమాండ్లపై తెరపైకి వస్తున్నా రు. ఒకరికి పదవి ఇచ్చి మరొకరికి ఇవ్వక పోతే అసంతృప్తి పెరిగి పుట్టి మునిగి పోతుందని అసలు మంత్రి వర్గ విస్తర ణనే కాంగ్రెస్ హైకమాండ్ ఆలస్యం చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది.

# రేషన్ కార్డ్ స్టేటస్ ఇలా చెక్ చేసుకోండి

నల్గొండ, ఏప్రిల్ 16,తెలంగాణలో కొత్త రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అర్హత గల వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. తొలుత గ్రామ సభల్లోనూ, ఆ తర్వాత మీ సేవా కేంద్రాల ద్వారా తెలుపు రంగు రేషన్ కార్డు కోసం లక్షలాది మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. కానీ దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా దాని స్టేటస్ మాత్రం తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తమకు తెలుపు రంగు కార్డు ఈ ప్రభుత్వంలోనైనా వస్తుందా? రాదా? అన్న అనుమానంతో ప్రజలు ఉన్నారు. సంక్షేమ పథకాలు దక్కాలంటే తెలుపు రంగు రేషన్ కార్డు అవసరం కావడంతో వీటికి తెలంగాణ వ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఏర్పడింది. గత పదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో లబ్దిదారుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. అందిన సమాచారం మేరకు ఆరు లక్షల మందికి పైగానే తెలుపు రంగు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. తెలుపు రంగు రేషన్ కార్డు వస్తే విద్య, వైద్యం విషయాల్లో నిర్భయంగా ఉండటమే కాకుండా ఉచిత విద్యుత్తు పాటు ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ కూడా లభిస్తుందని ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుని రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. తమ రేషన్ కార్డుల పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రజలు తిరిగి మీ సేవా కేంద్రాల వద్ద క్యూకడుతున్నారు. కానీ వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు అయితే రేషన్ కార్డు స్టేటస్ ను తెలుసుకోవడానికి ప్రభుత్వం సులువైన పద్ధతిని ప్రవేశపెట్టింది. ఇంట్లో ఉ ండే రేషన్ కార్డు స్టేటస్ ను తెలుసుకునే వీలుంది. ఫోన్ ద్వారానే స్టేటస్ ను తెలుసుకునే వీలుంది. ఫోన్ లో తెలంగాణ ఫుడ్ సెక్యూరిటీ అధికారిక వెబ్ సైట్ అయిన ష్ట్రబిబిజూబ://వజూటబ.బివశ్రీజీనిణజీనిజీ.ణనీల.తిని/ఈనీనీటూవఇ-బీతీతిబిఎంఇ-బి/ ను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. స్క్రీన్ మీద కనిపించే రేషన్ కార్డు ఆప్షన్ పై క్లిక్ చేసిన వెంటనే అనేక ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో ఈూఅ ంజూజూశ్రీతిఇ-జీబితినీని ూవజీతీఇ-ష్ట్ర చేస్తే మీ రేషన్ కార్డు స్టేటస్ తెలుస్తుంది. మీ సేవా అప్లికేషన్ నసెర్చ్ విండో ఓపన్ అవుతుంది. అందులో ముందుగా మీ జిల్లాను సెలెక్ట్ చేసుకుని మీ సేవా బాక్స్ పై అప్లికేషన్ నెంబర్ టైప్ చేసి క్లిక్ చేస్తే మీరు చేసిన దరఖాస్తు పరిశీలనలో ఉ ందా? లేదా రిజెక్ట్ అయిందా? అన్నది తెలుసుకోవచ్చు.

# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

## 50 లక్షల టన్నుల బియ్యం మిగులు

హైదరాబాద్, ఏప్రిల్ 16, ఈ ఏడాది దేశంలోనే వరి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ సంవత్సరం దాదాపు 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి జరిగిందని, ఇది ఒక రికార్డు అని ఆయన తెలిపారు. ఈ ఘనతకు రైతుల కృషి, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, ప్రకృతి సహకారం, కొత్త వరి రకాలు అందుబాటులో ఉండటం కారణమని చెప్పారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు.రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం, కేంద్ర నిల్వల కోసం 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించిన తర్వాత కూడా, రాష్ట్రంలో ఇంకా 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిగులు ఉంటుందని మంత్రి వెల్లడించారు. ఈ మిగులు ధాన్యాన్ని మార్కెట్ చేయడానికి అన్వేషణలో భాగంగా, ఆగ్నేయ ఆసియాలోని ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడానికి ఆ దేశ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎంటియు-1010 మరియు ఐఆర్-64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని, వీటికి ఫిలిప్పీన్స్‌లో అధిక డిమాండ్ ఉందని ఆయన తెలిపారు.వరి సాగులో ఇటీవల రైతులు ఆదరిస్తున్న నేరుగా విత్తే పద్ధతి, రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం, తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. ఆధునిక బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు.ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ.. ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని, నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రభుత్వం వరి ధాన్యం సేకరణ కేంద్రాల నుంచి బియ్యం ఔత్సాహిక ఎగుమతిదారులకు సరఫరా చేస్తే ప్రభుత్వానికి అయ్యే ఖర్చుకు సమానంగా ఔత్సాహికదారులకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండానే ఎగుమతులను ప్రోత్సహించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# నేతలకు రేవంత్ ఫుల్ క్లాస్

## పార్టీలో క్రమశిక్షణపై దృష్టి..

హైదరాబాద్, ఏప్రిల్ 16, తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ విస్తరణ చుట్టూ కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. పార్టీలో అంతర్గత చర్చలపై కొందరు నేతలు బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారు. అధిష్టానానికే వార్నింగ్ ఇస్తున్నారు. రేసులో తనకు పోటీగా ఉన్న సహచర ఎమ్మెల్యేలపై విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రకటనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితీవ్రంగా స్పందించారు. శంషాబాద్‌లోని నోవాటెల్ లో సీఎల్పీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇందులో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డికి సీఎం క్లాస్ పీకారు.తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ చర్చలు ఊపందుకున్న నేపథ్యంలో, కొందరు నాయకులు మంత్రి పదవుల కేటాయింపుపై బహిరంగ వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కొందరు నాయకులను మంత్రులుగా ప్రకటిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారం సీఎల్పీ సమావేశంలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి చర్యలు పార్టీలో గందరగోళాన్ని సృష్టిస్తాయని, నాయకులందరూ క్రమశిక్షణతో వ్యవహరించాలని రేవంత్‌రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన నిర్ణయాలు కాంగ్రెస్ హైకమాండ్ తీసుకుంటుందని సీఎం స్పష్టం చేశారు. మంత్రి పదవుల ఎంపికలో హైకమాండ్ ఇప్పటికే కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఎవరిని మంత్రులుగా నియమించాలనే విషయంలో హైకమాండ్ సూచనల మేరకు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. అందరూ ఈ నిర్ణయాన్ని గౌరవించాలని రేవంత్‌రెడ్డి నాయకులకు సూచించినట్లు సమాచారం. ఈ వ్యాఖ్యలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి వంటి నాయకులకు స్పష్టమైన సందేశంగా భావిస్తున్నారు.మంత్రివర్గ విస్తరణ చుట్టూ జరుగుతున్న చర్చలు, అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నాయకుల వ్యాఖ్యలు పార్టీ ఐక్యతను దెబ్బతీసే అవకాశం ఉందని రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో, అనవసరమైన ప్రకటనలు, ఊహాగానాలు నాయకులు ఆపాలని, పార్టీలో క్రమశిక్షణ కాపాడాలని ఆయన సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వం, పార్టీ ఇమేజ్‌ను కాపాడటం అందరి బాధ్యత అని రేవంత్ రెడ్డి నొక్కి చెప్పినట్లు తెలుస్తోంది.సీఎల్పీ సమావేశంలో మంత్రివర్గ విస్తరణతోపాటు, పార్టీలో అంతర్గత విభేదాలను సామరస్యంగా పరిష్కరించేందుకు చర్చలు జరిగాయి. ఈ సమావేశానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడం, పార్టీని బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా, అందరూ ఒక్కతాటిపై ఉండి ప్రభుత్వ లక్ష్యాలను సాధించడంలో సహకరించాలని కోరినట్లు తెలుస్తోంది.రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణను నొక్కి చెప్పే ప్రయత్నంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రివర్గ విస్తరణ సమయంలో నాయకుల మధ్య అసంతృప్తి, వర్గ పోరు తలెత్తే అవకాశం ఉందని, దీనిని నియంత్రించేందుకు రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని అంటున్నారు. హైకమాండ్ నిర్ణయాలను గౌరవించడం ద్వారా పార్టీ ఐక్యతను కాపాడాలని భావిస్తున్నారని, ఈ సందేశం చామల కిరణ్ కుమార్ రెడ్డితోపాటు ఇతర నాయకులకు కూడా గట్టిగా చేరిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ధర్మపురి మండలం దమ్మన్నపేటలో విషాదం

**దుబాయ్ లో దమ్మన్నపేటకు చెందిన శ్రీనివాస్ హత్య**

**కడసారి చూపు కోసం కన్నీటిపర్యంతమవుతున్న కుటుంబ సభ్యులు**

**ప్రభుత్వం శవాన్ని అప్పగించాలని వేడుకోలు**

జగిత్యాల,ధర్మపురి మండలం దమ్మన్నపేటలో విషాదం అలుముకుంది. దమ్మన్నపేటకు చెందిన స్వర్గం శ్రీనివాస్ దుబాయ్ లో హత్యకు గురయ్యారు. ఓ బెకరీలో పని చేసే శ్రీనివాస్ తో పాటు నిజామాబాద్ కి చెందిన మరో వ్యక్తి అలుకుస్ ఏరియాలో బేకరీ షాప్ లో పని చేస్తుండగా పాకిస్తాన్ కు చెందిన వ్యక్తులు కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శ్రీనివాస్ ఉపాధి కోసం 20 ఏళ్ళ క్రితం దుబాయ్ కి వెళ్ళారు. అతనికి భార్య ఇంటర్, డిగ్రీ చదివే ఇద్దరు కొడుకులు ఉండగా ప్రస్తుతం స్వగ్రామం లో కాకుండా వేరే చోట నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ కన్నతల్లి రాజవ్వ ఒక్కరే ప్రస్తుతం స్వగ్రామంలో ఉండగా కొడుకు ఇక లేడనే విషయం తెలిసి బోరున విలపించారు. కడసారి చూపుకోసం మృతదేహాన్ని తమకు అప్పగించాలని కన్నీటిపర్యంతమై వేడుకున్నారు. బంధువులతో పాటు గ్రామస్తులు నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ను హత్య చేసిన వారిపై చర్యలు తీసుకుని శవాన్ని స్వస్థలానికి తెప్పించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

# 1500 ఎకరాల్లో అమరావతి మెగా రైల్వే స్టేషన్

విజయవాడ, ఏప్రిల్ 16, దేశంలోనే అతి పెద్ద రైల్వే స్టేషన్ కి అమరావతి కేరాఫ్ అడ్రస్ గా మారబోతోంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దక్షిణ భారత దేశంలోనే అత్యంత ముఖ్యమైన స్టేషన్లలో ఒకటిగా మార్చబోతోంది రైల్వే శాఖ. దాదాపు 1500 ఎకరాల సువిశాల ప్రాంగణంలో మెగా రైల్వే స్టేషన్ ఏర్పాటు కానుంది. నెక్కల్లు-పెదపరిమి సమీపంలో ఈ స్టేషన్ ఉంటుంది.మెగా రైల్వే స్టేష్ తో పాటు.. దానికి అనుసంధానంగా రైల్వే లైన్లను నిర్మించేందుకు రైల్వే శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తొలి విడతలో ఖమ్మం జిల్లాలోని ఎర్రుపాలెం నుంచి అమరావతికి రైల్వే లైన్ నిర్మిస్తోంది. మొత్తం 56.53 కి.మీ. రైల్వే లైన్‌లో తొలి దశలో 27 కి.మీ. ఏర్పాటు చేయబోతున్నారు. దాములూరు-వైకుంఠపురం మధ్య కృష్ణానదిపై 3.2 కి.మీ. పొడవున రైల్వేబ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపట్టబోతున్నారు. దీనికోసం తొలి దశలో 800 కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా అమరావతి సెంట్రిక్ గా జరిగే రైల్వే పనులకోసం 2245 కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతున్నారు. రాబోయే నాలుగేళ్లలో ఈ పనులన్నీ పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.ఉత్తరాదికి, మధ్య భారత దేశానికి, దక్షిణాదికి ఒక వారధిగా అమరావతి రైల్వే స్టేషన్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. అమరావతి నుంచి దేశంలోని అన్ని ప్రముఖ నగరాలకు రైల్వే లైన్లు ఉంటాయి. బెంగళూరు, కోల్ కత, నాగపూర్, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, దేశంలోని ఇతర నగరాలకు సైతం కనెక్టివిటీ పెంచుతారు. ఇక కార్గో టెర్మినల్ మరో ప్రత్యేకత. సరకు రవాణాకోసం రాష్ట్రంలోని ప్రధాన ఓడరేవులైన మచిలీపట్నం పోర్ట్, కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం పోర్ట్ లతో అమరావతికి లింక్ ఏర్పాటు చేస్తారు. మల్టీ మోడల్ కమర్షియల్ కార్గో టెర్మినల్ ని ఎన్టీఆర్ జిల్లాలోని పరిటాల వద్ద ఏర్పాటు చేయబోతున్నారు.అమరావతి ప్రాంతంలో ఉన్న అమరలింగేశ్వర స్వామి ఆలయం, ఉండవల్లి కేవ్స్, అమరావతి స్థూపం, ధ్యాన బుద్ధ విగ్రహం.. ఇలా పర్యాటకంగా కూడా అమరావతి అభివృద్ధికి ఈ రైల్వే లైన్లు దోహదపడతాయని అంటున్నారు. అమరావతితోపాటు ఆంధ్రప్రదేశ్ లో 73 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తామని రైల్వే శాఖ ప్రకటించింది.అమరావతి నగరానికి రైల్వేలైన్ ను 2017-18లోనే కేంద్రం మంజూరు చేసింది. కానీ వివిధ కారణాల వల్ల అప్పట్లో అది సాధ్యం కాలేదు. పనులు కూడా ముందుకు కదల్లేదు. వైసీపీ ప్రభుత్వంలో అమరావతి అభివృద్ధి పూర్తిగా మూలన పడింది. తిరిగి ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతి పనులు చకచకా ముందుకు కదులుతున్నాయి. ఈసారయినా అమరావతిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టి, అభివృద్ధి అంటే ఏంటో చూపించి ఎన్నికలకు వెళ్లాలని సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారు. అందుకే ఎన్నికలకు ముందుగానే అమరావతి రైల్వే ప్రాజెక్ట్ ని పూర్తి చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాజధానికి రైల్వే టెర్మినల్ ప్రధాన ఆకర్షణగా మారుతుంది. అమరావతి రైల్వే లైన్ నిర్మాణంపై కేంద్రం కూడా ఉత్సాహంగా ఉంది. ఇప్పటికే పలుమార్లు రైల్వే మంత్రి కూడా అమరావతి రైల్వే పురోగతిపై స్పందించారు.

# విశాఖ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్

విశాఖపట్టణం, ఏప్రిల్ 16, రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం వైజాగ్. రాష్ట్రం విడిపోయిన తర్వాత.. విశాఖ అభివృద్ధిపై ప్రభుత్వాలు స్పెషల్ ఫోకస్ పెట్టాయి. మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయి. పరిశ్రమలను ఆకర్షిస్తున్నాయి. ఐటీ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నాయి. దీంతో విశాఖ చుట్టుపక్కల భూముల రేట్లు క్రమంగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో భూములపై పెట్టుబడి పెడితే.. భవిష్యత్తు బంగారం అవుతుందని నిపుణులు చెబుతున్నారు..భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం రాబోతుంది. దీంతో ఈ ప్రాంతం రియల్ ఎస్టేట్ పరంగా చాలా ముఖ్యమైనదిగా మారుతోంది. విమానాశ్రయానికి దగ్గరగా ఉన్నందున నివాస, వాణిజ్య స్థలాలకు డిమాండ్ పెరుగుతోంది. అనందపురం, తగరపువలస వంటి ప్రాంతాలు కూడా భోగాపురానికి సమీపంలో ఉండటంతో అభివృద్ధి చెందుతున్నాయి.మధురవాడ..ఇది విశాఖపట్నంలోని ప్రధాన ఐటీ హబ్. ఇక్కడ అనేక ఐటీ కంపెనీలు, విద్యా సంస్థలు ఉన్నాయి. ఉద్యోగులు, విద్యార్థుల కోసం నివాస స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. గత కొన్నేళ్లుగా ఇక్కడ భూముల రేట్లు స్థిరంగా పెరుగుతున్నాయి. భవిష్యత్తులో కూడా ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశం ఉంది.యెండాడ కూడా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడ అనేక రెసిడెన్షియల్ ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇది ఐటీ హబ్‌కు దగ్గరగా ఉండటంతో ఉద్యోగులకు అనుకూలమైన ప్రాంతంగా మారింది. ప్రశాంతమైన వాతావరణం, మంచి కనెక్టివిటీ ఈ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా మారుస్తున్నాయి. ఈ ప్రాంతంలో భవిష్యత్తులో భూముల రేట్లు భారీగా పెరిగే అవకాశం ఉంది.గాజువాక, కూర్మన్నపాలెం.. గాజువాక ఒక పారిశ్రామిక ప్రాంతం. ఇక్కడ అనేక పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. కూర్మన్నపాలెం కూడా గాజువాకకు దగ్గరగా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉండటంతో నివాస స్థలాలకు డిమాండ్ ఉంటుంది.పెందుర్తి, సబ్బవరం..ఈ ప్రాంతాలు నగరానికి కొంచెం దూరంగా ఉన్నప్పటికీ.. ఇక్కడ తక్కువ ధరలకు భూములు అందుబాటులో ఉన్నాయి. భవిష్యత్తులో నగర విస్తరణ జరిగే అవకాశం ఉండటంతో ఇక్కడ కూడా భూముల రేట్లు పెరిగే అవకాశం ఉందిఆనందపురం.. ఇది ఐటీ హబ్‌కు, భోగాపురం విమానాశ్రయానికి మధ్యలో ఉంటుంది. ఇక్కడ రెసిడెన్షియల్ ప్రాజెక్టులు పెరుగుతున్నాయి. ఫలితంగా భూములకు డిమాండ్ ఏర్పడింది.కొత్తవలస.. ఇది కూడా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ఇక్కడ డీటీసీపీ, వుడా ఆమోదిత లేఅవుట్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి భూములు భవిష్యత్తులో మంచి రాబడినిచ్చే అవకాశం ఉంది.విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు పెట్టే ముందు.. ఆ ప్రాంతంలోని మౌలిక సదుపాయాలు (రోడ్లు, నీరు, విద్యుత్, రవాణా సౌకర్యాలు మొదలైనవి) పరిశీలించడం ముఖ్యంప్రభుత్వ విధానాలు, నగర విస్తరణ ప్రణాళికలు కూడా భూముల రేట్లపై ప్రభావం చూపుతాయి. నిపుణుల సలహా తీసుకోవడం, ప్రాపర్టీ చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించడం చాలా అవసరం.

# చర్చగా మారిన ఆర్పీ సిసోడియా బదిలీ వ్యవహారం

## ముక్కు సూటితనమే మైనస్సా


విజయవాడ, ఏప్రిల్ 16,ఏపీ రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బదిలీ వ్యవహారం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికారుల మధ్య ఆధిపత్య పోరులో భాగంగా సిసోడియాను అప్రధాన్య పోస్టుకు బదిలీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. గత నెలలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సిసోడియా స్వాగతోపన్యాసం చేయాల్సి ఉన్నా ఆయన మాట్లాడలేదు.ఇటీవలి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆర్పీ సిసోడియా స్వాగతోపన్యాసం చేయకుండా కొందరు సిఎంఓ అధికారులు అడ్డు పడ్డారనే ప్రచారం జరిగింది. అప్పట్లోనే ఏపీ ఐఏఎస్ అధికారుల్లో ఏదో జరుగుతోందనే ప్రచారం జరిగింది. తాజాగా సిసోడియాకు స్థాన చలనం కలగడంతో అధికారుల మధ్య ఆధిపత్య పోరు చర్చనీయాంశంగా మారింది.పలువురు ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టింగ్ లేకుండా ఖాళీగా ఉన్న పలువురు అధికారులకు కూడా పోస్టింగ్ దక్కింది. వీరిలో వైసీపీ హయంలో చక్రం తిప్పిన అధికారులు కూడా ఉన్నారు. జగన్ హయంలో సిఎంఓలో పనిచేసిన అధికారులతో పాటు పలువురు కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు పోస్టింగ్ దక్కింది. ఈ క్రమంలో స్పెషల్ సీఎస్‌గా ఉన్న అధికారిని అప్రధాన్య పోస్టుకు బదిలీ చేయడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ప్రస్తుతం ఏపీ సీఎస్‌గా 1992 బ్యాచ్‌కు చెందిన విజయానంద్ ఉన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో విజయానంద్ పదవీ విరమణ చేస్తారు. ప్రభుత్వం మరికొంత కాలం ఆయన పదవీ కాలాన్ని పొడిగించే అవకాశాలు లేకపోలేదు.సీఎస్ కంటే సీనియార్టీలో శ్రీలక్ష్మి ముందు ఉన్నారు. శ్రీలక్ష్మిపై పలు అభియోగాలు ఉన్నాయి. గత ప్రభుత్వం పురపాలక శాఖ బాధ్యతలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీనియార్టీలో ముందున్నా శ్రీలక్ష్మిని పక్కన పెట్టారు. ఆమె తర్వాత సీనియార్టీలో అనంతరాము, సాయిప్రసాద్; అజయ్ జైన్ ఉన్నారు. సాయిప్రసాద్ 2026 మే నెలలో, అజయ్ జైన్ 2026 జులైలో పదవీ విరమణ చేస్తారు. వారి తర్వాత సీనియర్‌గా 1991 బ్యాచ్‌కు చెందిన ఆర్పీ సిసోడియా ఉన్నారు. ఈ క్రమంలో అధికారుల మధ్య నెలకొన్న విభేదాలతో సిసోడియా బలయ్యారని ప్రచారం జరుగుతోంది.అధికారుల పనితీరుపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిఘా వర్గాల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. ఈ క్రమంలో కీలక శాఖలకు బాధ్యులుగా ఉన్న అధికారుల పని తీరుపై నెలన్నర క్రితం ఇంటెలిజెన్స్ అధికారులు సమాచారాన్ని సేకరించారు. ఈ క్రమంలో సిఎంఓలో పనిచేసే అధికారుల పనితీరుపై ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారాన్ని సేకరించాయి.పలువురు అధికారుల వ్యవహార శైలిపై నిఘా వర్గాలు సమాచారాన్ని సేకరించినా కొందరు అధికారులు ప్రత్యేకంగా ఆర్పీ సిసోడియా పనితీరును ప్రభుత్వ పెద్దలకు చేరవేసినట్టు తెలుస్తోంది. దీని వెనుక జరిగిన పరిణామాలపై అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.రెవిన్యూ శాఖ బాధ్యుడిగా జిల్లా కలెక్టర్ల పనితీరుకు స్పెషల్ సీఎస్‌ను బాధ్యుడిని చేసినట్టు ఐఏఎస్‌లలో ప్రచారం జరుగుతోంది. జిల్లాల్లో పెండింగ్ ఫైల్స్ క్లియర్ కాకపోవడానికి సిసోడియాను బాధ్యుడిని చేసి కొద్ది రోజులుగా పక్కన పెట్టినట్టు తెలుస్తోంది. మరోవైపు కీలకమైన రెవిన్యూ శాఖను తమకు నచ్చిన వారికి అప్పగించే క్రమంలోనే సిసోడియాను పదవి నుంచి తప్పించారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో సిసోడియాపై ఇచ్చిన నివేదికలో పలు ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రెవిన్యూ శాఖలో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం పెరగడం, భూ కేటాయింపులు, అనుమతులను మంజూరు చేయడంలో నిబంధనల ఉల్లంఘనలు తెరపైకి వచ్చాయి.రెవిన్యూశాఖలో పనిచేస్తోన్నఓ రిటైర్డ్ ఉద్యోగిపై పలు ఆరోపణలు రావడంతో కొద్ది రోజుల క్రితం అతడిని పదవి నుంచి తప్పించారు. 73ఏళ్ల సదరు ఉద్యోగి.. రిటైర్మెంట్ తర్వాత కూడా రెవిన్యూ శాఖలో పని చేస్తున్నారు. అనుభవం పేరుతో రెవిన్యూ శాఖలో చక్రం తిప్పుతున్నారు. ఈ క్రమంలో విశాఖపట్నంలో చేసిన భూ కేటాయింపులు వివాదాస్పంగా మారాయి. జిల్లాల్లో భూముల వ్యవహారాల్లో వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, రెవిన్యూ శాఖ ఉన్నతాధికారి పేరుతో పైరవీలు చేస్తున్నట్టు తెలియడంతో అతడిని తొలగించినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఐఏఎస్ అధికారికి మాజీ ఉద్యోగికి మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగినట్టు సచివాలయ వర్గాలు చెబుతున్నాయి.తమ సామాజిక వర్గానికి చెందిన ఉద్యోగిని తొలగించడంతో కొన్ని కుల సంఘాలు రెవిన్యూ శాఖ కార్యదర్శిపై సీఎంఓలో ముఖ్యమైన అధికారులకు ఫిర్యాదులు చేశాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పోస్టుకు ఆర్పీ సిసోడియా ప్రయత్నాలు చేస్తున్నారని తెలియడంతో ఆయన్ని కీలక బాధ్యతల నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు జరిగినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా వ్యక్తిగత ఆరోపణలతో నివేదికలు ఇచ్చినట్టు తెలుస్తోంది.గుంటూరు జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడితో ఐఏఎస్ అధికారి సన్నిహితంగా ఉంటున్నాడని నిఘా వర్గాల ద్వారా గుర్తించాయి. సీఎస్ రేసులో ఉన్న ఇతర ఐఏఎస్‌లు అప్రమత్తం కావడం, సిసోడియాను కీలక బాధ్యతల నుంచి తప్పించేందుకు స్కెచ్ వేసినట్టు తెలుస్తోంది.ఆర్పీ సిసోడియా రెవిన్యూ శాఖ బాధ్యతలు నిర్వహించిన సమయంలో “కవి” పేరుతో ఓ ప్రైవేట్ వ్యక్తి పెత్తనం చెలాయించినట్టు తెలుస్తోంది. రెవిన్యూ శాఖ మంత్రి తాలుకా అంటూ గత పది నెలలుగా రెవిన్యూ శాఖలో చక్రం తిప్పాడని ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడు కావడంతో ఆ శాఖ కార్యదర్శి చూసి చూడనట్టు వదిలేశారు. ప్రైవేట్ సంభాషణల్లో ఐఏఎస్ అధికారి చేసిన వ్యాఖ్యలను రికార్డు చేసి సిఎంఓకు చేరవేయడంతో తాజా బదిలీ జరిగినట్టు తెలుస్తోంది.ఈ క్రమంలో రెవిన్యూ శాఖలో ప్రైవేట్ వ్యక్తుల నిర్వాకంపై కొందరు రెవిన్యూ శాఖ కార్యదర్శిని అప్రమత్తం చేసినా మంత్రి తాలుకాగా ప్రచారం కావడంతో సిసోడియా తేలిగ్గా తీసుకోవడం ఆయన కొంప ముంచినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో ఆ శాఖ బాధ్యులు సురక్షితంగా ఉంటే ఐఏఎస్ అధికారి మాత్రం బలయ్యారు.

# ఆ నాలుగు జిల్లాలు.. మహర్దశ

గుంటూరు, ఏప్రిల్ 16, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.. రాష్ట్రంలో మెగా సిటీ మాస్టర్ ప్లాన్ చేస్తోంది. భవిష్యత్తులో అమరావతి, గుంటూరు, విజయవాడ నగరాలతో పాటుగా మంగళగిరి, తాడేపల్లిని కలిపి మెగాసిటీగా సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లుమంత్రి నారాయణ తెలిపారు. ఈ మెగాసిటీకి అమరావతిలో ఒక అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఉందన్నారు.. అందుకే 5వేల ఎకరాలు అవసరం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ భూమిని పరిశీలించాలని ఆదేశించారన్నారు. మంత్రి నారాయణ రాజధాని నిర్మాణ పనులకు కావాల్సిన గ్రావెల్ కోసం అమరావతి ప్రాంతంలోని అనంతవరంలోని కొండలను పరిశీలించారు.అమరావతకి రెండో దశలో భూమిని సేకరించాలా?.. భూమిని సమీకరించాలా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు మంత్రి నారాయణ. భూమిని సేకరణ ద్వారా తీసుకుంటే రిజిస్ట్రేషన్ ధర కంటే రెండున్నర రెట్లు ఎక్కువ వస్తుందని.. అదే సమీకరణ ద్వారా అయితే రైతలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. అందుకే రైతులు సమీకరణ కోరుకుంటున్నారని.. వారికి రోడ్లు, రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు లేఅవుట్లు వేసి, డ్రెయిన్లు కట్టాల్సి ఉంటుంది అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు హైదరాబాద్‌లో విమానాశ్రయం నిర్మించినప్పుడు భారీగా భూములు తీసుకున్న సమయంలో కూడా విమర్శలు వచ్చాయని.. ఇప్పుడు హైదరాబాద్ బెస్ట్ ఎయిర్‌పోర్టుల్లో ఒకటిగా నిలిచిందన్నారు. చంద్రబాబు రాబోయే వందేళ్ల గురించి ఆలోచిస్తారని.. అందుకే అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంని నిర్మించాలనే ఆలోచనలు ఉన్నారన్నారు. ఇలా అమరావతిలో ఒక్కొక్కటిగా మౌలిక సదుపాయాల్ని కల్పిస్తే ఆర్థిక కార్యాకలాపాలు అభివృద్ధి చెందుతాయన్నారు. నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని.. అందుకే ఆ దిశగా పని చేస్తున్నామన్నారు.అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అపోహలు అవసరం లేదన్నారు మంత్రి నారాయణ. మూడేళ్లలోనే మాస్టర్ ప్లాన్‌తో అమరావతి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఏడాదిలోపు అధికారుల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలను పూర్తి చేస్తామన్నారు. అమరావతిలో సుమారు 360 కి.మీ. ట్రంక్ రోడ్లు ఏడాదిన్నరలో నిర్మిస్తామన్నారు. రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లలోని రోడ్లు రెండున్నరేళ్లలో.. ఐకానిక్ టవర్లు మూడేళ్లలో నిర్మిస్తామని చెప్పారు.

# సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బీఆర్ గవాయ్

భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి గా జస్టిస్ బీఆర్ గవాయ్ నియమితులయ్యారు.



కొలీజియం సిఫారసుల మేరకు ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ పేరును ప్రతిపాదించారు. వచ్చే నెల 13న జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ కాలం ముగియనుండటంతో ఆయన స్థానంలో కొత్త ప్రధాన న్యాయమూర్తిని ప్రకటించారు. జస్టిస్ గవాయ్ మే 14న సీజేఐగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. ఆయన 1960 నవంబర్ 24న అమ్రావతిలో జన్మించారు. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు.

# నెలకు మద్యం దందా 60 కోట్లపైనే

నెల్లూరు, ఏప్రిల్ 16, మద్యం కుంభకోణంలో ప్రధానంగా వినిపిస్తున్న పేరు రాజ్ కసిరెడ్డి. ఈ మొత్తం ఎపిసోడ్లో ఆయనే కర్త,కర్మ,క్రియ. ఈ కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం ముమ్మరంగా వేటాడుతోంది. విచారణ కోసం పిలిచినా ఆయన లెక్క చేయలేదు. నోటీసులు ఇచ్చిన స్పందించలేదు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు ఆయన ఇల్లు, కార్యాలయాలు, సన్నిహితులు, స్నేహితుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్ చేరుకున్న 50 మంది ఏపీ పోలీసులు తెలంగాణ పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టారు. లిక్కర్ కింగ్ పిన్ గా ఉన్న రాజ్ కసిరెడ్డి అరెస్టు లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.అయితే ఈ దర్యాప్తు బృందానికి నేతృత్వం వహిస్తున్నారు ఏఎస్పీ భూషణం . అయితే ఈ దర్యాప్తులో నమ్మలేని నిజాలు బయటకు వస్తున్నాయి. రాజ్ కసిరెడ్డి సినిమా వ్యాపారంలో పెట్టుబడులు పెట్టేందుకు బినామీ పేర్లతో ఈడి క్రియేషన్స్ అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఇప్పటికే పలు సినిమాల నిర్మాణంలో భాగస్వామిగా కూడా ఉన్నారని గుర్తించారు దర్యాప్తు బృందం అధికారులు. మరిన్ని కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ఒప్పందాలు చేసుకుంటున్న తరుణంలోనే మద్యం స్కాం బయటపడినట్లు తెలుస్తోంది. అదేవిధంగా రియల్ ఎస్టేట్, పవర్ ప్లాంట్స్ లోను వాటాలు పెట్టారని చెబుతున్నారు. కసిరెడ్డి కూతురు ఇషాని పేరుతో ఓన్నాు సమస్తను సైతం నెలకొల్పారని పోలీసులు చెబుతున్నారు. హైదరాబాదులోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా వాటాలు పెట్టారని? బ్లాక్ మనీని వైట్ గా మార్చేశారని పోలీసులు గుర్తించినట్లు







తెలుస్తోంది.వాస్తవానికి రాజ్ కసిరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుడు. ఆయనకు మద్యం కుంభకోణంతో సంబంధం ఎలా అన్నది ఇప్పుడు ప్రశ్న. పేరుకే ఐటి సలహాదారుడు కానీ.. ఆయన ఎక్కువగా మద్యం వ్యాపారాన్ని పర్యవేక్షించాలని ఫిర్యాదులు ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రంగా మరోవైసీపీ నేతతో కలిసి ఆయన ఈ దందా నడిపినట్లు సమాచారం. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఏ రోజు ఏ బ్రాండ్ అమ్మాలనేది రాజ్ కసిరెడ్డి డిసైడ్ చేసేవారని.. తమకు ముడుపులు ఇచ్చిన కంపెనీలకి ఆర్డర్లు ఇచ్చేవారని.. ఇందుకోసం కేసుకు 150. ఇలా ప్రతినెల కమిషన్ల రూపంలో 60 కోట్ల రూపాయలు వసూలు చేసేవారని పోలీస్ దర్యాప్తులో తేలినట్లు సమాచారం. వైసిపి పాలనలో నాలుగేళ్ల ఎనిమిది నెలల పాటు ఈ దందా కొనసాగిందని.. వేల కోట్ల రూపాయలు అక్రమంగా కూడేసారని రాజ్ కసిరెడ్డి పై ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం రాజ్ కసిరెడ్డి కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం హైదరాబాదులో జల్లెడ పడుతోంది. ఆయన అవినీతిపరుడు అంటూ పత్రికల్లో కథనాలు వచ్చిన రాజ్ కసిరెడ్డి ఎంతవరకు స్పందించలేదు. ప్రస్తుతం ఆయన హైదరాబాదులోనే ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కొద్దిరోజుల కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి మద్యం స్కాం విషయంలో సంచలన ఆరోపణలు చేశారు. రాజ్ కసిరెడ్డి సూత్రధారి అని తేల్చేశారు. ఇప్పుడు రాజ్ కసిరెడ్డి దందాలు ఒక్కొక్కటి బయటకు వెలుగులోకి వస్తుండడం గమనార్హం.

# ప్రశ్నించడం మానేశారా...

ఏలూరు, ఏప్రిల్ 16, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. 2014లో నాడు బీజేపీ, టీడీపీ కూటమికి పరోక్షంగా మద్దతిచ్చిన పవన్ కల్యాణ్ 2019 ఎన్నికలకు వచ్చేసరికి విభేదించారు. సొంతంగా పోటీ చేసిచేతులు కాల్చుకున్నారు. నాడు అమరావతి రాజధాని రైతుల నుంచి 32 వేల ఎకరాల మూడు పంటల భూమిని సేకరించడాన్ని పవన్ కల్యాణ్ తప్పుపట్టారు. రాజధానికి అంత భూములు అవసరమా? అని ప్రశ్నించారు.అంతేకాదు నాడు ఒకడుగు ముందుకేసి రాజధాని ప్రాంతంలో పర్యటించి భూములు తీసుకున్న రైతులకు అండగా నిలబడతానని భరోసా కూడా ఇచ్చి వచ్చారు. అయితే 2024 ఎన్నికల నాటికి ఆయన వాయిస్ మారింది. రాజధాని రైతుల విషయంలో ఆయన తన స్టాండ్ ను మార్చుకున్నారు. అసలు నాడు ప్రశ్నించిన దానిని మర్చిపోయారనిపిస్తుంది. రహదారుల కోసం ఇళ్లను కూల్చివేస్తే ఇప్పటంలో హడావిడి చేసిన పవన్ కల్యాణ్ ఇప్పుడు మౌనంగా ఉండటమేంటని పలువురు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రాజధాని అమరావతి కోసం మరో నలభై వేల ఎకరాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. రాజధాని కోర్ కాపిటల్ బయట నలభై ఎకరాలు సేకరించి భవిష్యత్ అవసరాల కోసం ఉంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది కానీ పవన్ కల్యాణ్ దీనిపై ఎలాంటి కామెంట్స్ చేయకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అధికారంలో లేనప్పుడు ఒకలా, ఉన్నప్పుడు మరొకలా వ్యవహరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే రాజధాని రైతులు తమ సమ్మతితోనే భూములు ఇస్తుండటంతో పవన్ కల్యాణ్ మౌనంగా ఉంటున్నారని జనసేననేతలు చెబుతున్నారు. గతంలో రాజధాని భూముల విషయంపై చంద్రబాబు నాయుడు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పవన్ కల్యాణ్ నేడు మౌనంగా ఉండటాన్ని ఆయన సర్దుకుపోయే మనస్తత్వానికి నిదర్శనమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రైతులు అంగీకరించినా అంత పెద్ద స్థాయిలో అంటే ఒక్క రాజధాని నిర్మాణం కోసం 77 వేల ఎకరాలను సేకరించడాన్ని ప్రశ్నించకపోతే ప్రజల తరుపున ఏమి చేస్తారంటూ నిలదీస్తున్నారు. కనీసం అభ్యంతరం కూడా చేయకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత పవన్ కల్యాణ్ పూర్తిగా ఛేంజ్ అయినట్లు కనపడుతుంది. మిత్ర ధర్మంతో చంద్రబాబు నాయుడు కు మద్దతు ఇవ్వడంలో తప్పులేదు.

# కడుపు క్యాన్సర్ ప్రారంభ సంకేతాలు, లక్షణాలు ఇవే.. నిర్లక్ష్యం చేస్తే అంతే!



కడుపు క్యాన్సర్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు, ఇది కడుపు యొక్క లైనింగ్‌లో అభివృద్ధి చెందే ఒక రకమైన క్యాన్సర్. ఇది ప్రపంచవ్యాప్తంగా సర్వసాధారణమైన క్యాన్సర్‌లలో ఒకటి . దీనిని ప్రారంభ దశలో గుర్తించినప్పుడు విజయవంతంగా చికిత్స చేయవచ్చు. దురదృష్టవశాత్తు, కడుపు క్యాన్సర్ యొక్క ప్రారంభ సంకేతాలు, లక్షణాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి . అవి ఇతర, తక్కువ తీవ్రమైన పరిస్థితుల కారణంగా తప్పుగా భావించబడతాయి. కడుపు క్యాన్సర్ యొక్క సంకేతాలు , లక్షణాల గురించి తెలుసుకోవడం , వాటిలో ఏవైనా ఉంటే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం. కడుపు క్యాన్సర్ యొక్క ప్రారంభ సంకేతాలు,లక్షణాలు అజీర్ణం – గుండెల్లో మంట: కడుపు క్యాన్సర్ యొక్క ప్రారంభ సంకేతాలు, లక్షణాలు చాలా సూక్ష్మంగా ఉంటాయి , వాటిని గుర్తించడం కష్టం. వాటిల్లో అజీర్ణం, గుండెల్లో మంట అనేది కడుపు క్యాన్సర్ యొక్క సర్వసాధారణమైన ప్రారంభ సంకేతం. అజీర్ణం లేదా గుండెల్లో మంట ఎప్పటికప్పుడు అందరికీ వస్తుంది, కానీ ఇది నిరంతరంగా , మరింత తీవ్రంగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.ఇంతకీ ఈ విష సంస్కృతి ఏమిటి?” కడుపు ఉబ్బరం– వాంతులు: కడుపు ఉబ్బినట్లు లేదా నిండుగా ఉన్నట్లు అనిపించడం కడుపు క్యాన్సర్ యొక్క మరొక ప్రారంభ సంకేతం. ఇది తినడం వల్ల లేదా తినకపోవడం వల్ల సంభవించవచ్చు. వికారం , వాంతులు కడుపు క్యాన్సర్ యొక్క ప్రారంభ సంకేతం కావచ్చు, ముఖ్యంగా కారణం లేకుండా సంభవిస్తే. అంతే కాకుండా ఆకలి మందగించడం లేదా తినాలనే కోరిక లేకపోవడం కడుపు క్యాన్సర్ యొక్క ప్రారంభ సంకేతం కావచ్చు. కారణం లేకుండా బరువు తగ్గడం కడుపు క్యాన్సర్ యొక్క ప్రారంభ సంకేతం కావచ్చు. . అవి ఇతర, తక్కువ తీవ్రమైన పరిస్థితుల వల్ల కూడా సంభవించవచ్చు అని గుర్తుంచుకోవడం ముఖ్యం. అయినప్పటికీ, ఈ సంకేతాలు , లక్షణాలు ఏవైనా ఉంటే, ముఖ్యంగా అవి నిరంతరంగా లేదా మరింత తీవ్రంగా ఉంటే, వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. ఎన్ని నెలలకు ఒకసారి చేయవచ్చు?” కడుపు క్యాన్సర్ యొక్క తరువాతి సంకేతాలు – లక్షణాలు కడుపు క్యాన్సర్ అభివృద్ధి చెందుతున్నప్పుడు, లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. కడుపు క్యాన్సర్ యొక్క తరువాత కడుపు నొప్పి వంటికి రావొచ్చు . ముఖ్యంగా కడుపు క్యాన్సర్ అభివృద్ధి చెందుతున్నప్పుడు కడుపు నొప్పి మరింత తీవ్రమవుతుంది. ఇది స్థిరమైన నొప్పి లేదా కడుపులో మొద్దుబారిన నొప్పిగా ఉంటుంది. రక్తం వాంతులు లేదా మలం రావడం కూడా దీనికి సంకేతం కావొచ్చు. ఇది కడుపు క్యాన్సర్ యొక్క తీవ్రమైన సంకేతం , తక్షణ వైద్య సంరక్షణను కోరాలి. మింగడంలో ఇబ్బంది: కడుపు క్యాన్సర్ అన్నవాహికలోకి వ్యాపిస్తే, అది మింగడంలో ఇబ్బందిని కలిగిస్తుంది. కామెర్లు అనేది చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం. కడుపు క్యాన్సర్ కాలేయానికి వ్యాపిస్తే అది కామెర్లకు కారణమవుతుంది. కడుపు క్యాన్సర్ శరీరానికి బలహీనత , అలసటను కలిగిస్తుంది. ఈ సంకేతాలు, లక్షణాలు ఏవైనా ఉంటే, వెంటనే వైద్యుడిని చూడటం చాలా ముఖ్యంఅయితే ఈ పండ్లు తినండి చాలు!” కడుపు క్యాన్సర్‌కు కారణాలు ఏమిటి? కడుపు క్యాన్సర్‌కు ఖచ్చితమైన ఆధారాలు లభించనప్పటికీ, కానీ ప్రమాదాన్ని పెంచే అనేక అంశాలు ఉన్నాయి. వీటిలో కడుపు క్యాన్సర్ వృద్ధులలో సర్వసాధారణం, 50 సంవత్సరాల వయస్సు పైబడిన వ్యక్తులు ఎక్కువగా ప్రమాదంలో ఉన్నారు. పురుషుల కంటే మహిళల్లో కడుపు క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. కడుపు క్యాన్సర్ యొక్క కుటుంబ చరిత్ర ఉన్న వ్యక్తులు వ్యాధిని అభివృద్ధి చేసే ప్రమాదం ఎక్కువ. హెలికోబాక్టర్ పైలోరి (హెచ్. పైలోరి) అనేది కడుపులో సంక్రమణను కలిగించే బ్యాక్టీరియా. హెచ్. పైలోరి సంక్రమణ కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. ఉప్పు, ధూమపానం చేసిన , ఊరగాయ ఆహారాలు అధికంగా ఉండే ఆహారం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. పండ్లు ,కూరగాయలు అధికంగా ఉండే ఆహారం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ధూమపానం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. అంతే కాకుండా ఊబకాయం కూడా కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. మీకు కడుపు క్యాన్సర్ ఉందని మీ వైద్యుడు అనుమానిస్తే, వారు అనేక పరీక్షలు చేయవచ్చు. వీటిలో శారీరక పరీక్ష ఒకటి. వైద్యుడిని సంప్రదించినప్పుడు మీకు సాధారణ సమీక్షతో పాటు కడుపులో గడ్డలు లేదా ఇతర అసాధారణతలు ఉన్నాయో లేదో తనిఖీ చేస్తాడు. ఎండోస్కోపీ అనేది ఒక సన్నని, వెలిగించిన గొట్టం, దీనిని ఎండోస్కోప్ అంటారు, ఇది మీ గొంతు , కడుపులోకి చొప్పించబడుతుంది. ఇది కడుపు యొక్క లైనింగ్‌ను చూడడానికి, బయాప్సీ కోసం కణజాల నమూనాలను తీసుకోవడానికి ఎండోస్కోప్‌ను ఉపయోగించవచ్చు. బయాప్సీ: బయాప్సీ అనేది కడుపు యొక్క లైనింగ్ నుండి కణజాల నమూనాను తొలగించడం. క్యాన్సర్ కణాలు ఉన్నాయో లేదో చూడటానికి నమూనాను మైక్రోస్కోప్‌లో పరిశీలిస్తారు. వీటితో పాటు ఇమేజింగ్ పరీక్షలు, సిటి స్కాన్‌లు, ఎంఆర్ఐ స్కాన్‌లు, పిఇటి స్కాన్‌లు వంటివి మీ కడుపు , ఇతర అవయవాల చిత్రాలను సృష్టించడానికి ఉపయోగించబడతాయి. ఈ చిత్రాలు క్యాన్సర్ వ్యాప్తి చెందిందో లేదో తెలుసుకోవడానికి సహాయపడతాయి. అంతే కాకుండా రక్త పరీక్షలు సాధారణ ఆరోగ్యాన్ని తనిఖీ చేయడానికి, కడుపు క్యాన్సర్‌ను సూచించే సంకేతాల కోసం ఉపయోగించబడతాయి. కడుపు క్యాన్సర్‌కు చికిత్స ఏమిటి? కడుపు క్యాన్సర్ చికిత్స క్యాన్సర్ దశ, సాధారణ ఆరోగ్యం, ప్రాధాన్యతలతో సహా అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. కడుపు క్యాన్సర్‌కు ప్రధాన చికిత్సల ద్వారా ఈ వ్యాధిని తగ్గించడానికి సహాయపడుతుంది. కడుపు క్యాన్సర్ యొక్క ప్రధాన చికిత్స శస్త్రచికిత్స. శస్త్రచికిత్స సమయంలో, క్యాన్సర్ కణితి, చుట్టుపక్కల ఆరోగ్యకరమైన కణజాలం తొలగించబడతాయి. కొన్ని సందర్భాల్లో, కడుపు మొత్తం లేదా కొంత భాగం తొలగించవలసి ఉంటుంది. కీమోథెరపీ; కీమోథెరపీ అనేది క్యాన్సర్ కణాలను చంపడానికి మందులను ఉపయోగించే చికిత్స. శస్త్రచికిత్స తర్వాత మిగిలి ఉన్న క్యాన్సర్ కణాలను చంపడానికి లేదా శస్త్రచికిత్స సాధ్యం కానప్పుడు క్యాన్సర్‌ను కుదించడానికి కీమోథెరపీ ఉపయోగించవచ్చు. రేడియేషన్ థెరపీ కూడా చేస్తారు. ఇదిది క్యాన్సర్ కణాలను చంపడానికి అధిక–శక్తి కిరణాలను ఉపయోగించే చికిత్స. శస్త్రచికిత్స తర్వాత మిగిలి ఉన్న క్యాన్సర్ కణాలను చంపడానికి లేదా శస్త్రచికిత్స సాధ్యం కానప్పుడు క్యాన్సర్‌ను కుదించడానికి రేడియేషన్ థెరపీ ఉపయోగించవచ్చు. లక్ష్య చికిత్స అనేది క్యాన్సర్ కణాల యొక్క నిర్దిష్ట లక్షణాలను లక్ష్యంగా చేసుకునే మందులను ఉపయోగించే చికిత్స. క్యాన్సర్ పెరుగుదల , వ్యాప్తిలో పాల్గొన్న నిర్దిష్ట అణువులను లక్ష్యంగా చేసుకోవడానికి లక్ష్య చికిత్స ఉపయోగించవచ్చు. ఇమ్యునోథెరపీ అనేది క్యాన్సర్ కణాలను చంపడానికి మీ స్వంత రోగనిరోధక వ్యవస్థను ఉపయోగించే చికిత్స. క్యాన్సర్ కణాలను గుర్తించి వాటిపై దాడి చేయడానికి రోగనిరోధక వ్యవస్థను ప్రేరేపించడానికి ఇమ్యునోథెరపీ ఉపయోగించవచ్చు. కడుపు క్యాన్సర్‌ను ఎలా నివారించాలి? కడుపు క్యాన్సర్‌ను నివారించడానికి ఖచ్చితమైన మార్గం లేదు, కానీ ప్రమాదాన్ని తగ్గించడానికి చేయగలిగే అనేక పనులు ఉన్నాయి. వీటిలో పండ్లు, కూరగాయలు , తృణధాన్యాలు అధికంగా ఉండే హెల్తీ డైట్ తినడం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఉప్పు, ధూమపానం చేసిన , ఊరగాయ ఆహారాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం మానుకోండి. అధిక బరువు లేదా ఊబకాయం కలిగి ఉండటం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. హెల్తీ వెయిట్ మెయింటెన్ చేయడం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ధూమపానం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. మీరు ధూమపానం చేస్తే, మానేయడానికి సహాయం పొందండి. పైలోరి సంక్రమణకు చికిత్స చేయించుకోండి. హెచ్. పైలోరి సంక్రమణ ఉంటే, దానికి చికిత్స చేయించుకోవడం కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. కడుపు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటే, రెగ్యులర్ స్క్రీనింగ్ చేయించుకోవాలనే దాని గురించి మీ వైద్యుడితో మాట్లాడాలి. ఇది కడుపు క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడానికి స్క్రీనింగ్ సహాయపడుతుంది, చికిత్సను మరింత విజయవంతం చేస్తుంది. చేయవచ్చు. కడుపు క్యాన్సర్ యొక్క సంకేతాలు, లక్షణాల గురించి తెలుసుకోవడం , వాటిలో ఏవైనా ఉంటే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం.

# రక్తదానం ఎవరెవరు చేయకూడదు? ఎన్ని నెలలకు ఒకసారి చేయవచ్చు?



రక్తదానం చేయడం అనేది ఒక గొప్ప మానవతావాద దృక్పథం. ఇది మరొకరి ప్రాణాలను కాపాడటానికి సహాయపడే ఒక అద్భుతమైన అవకాశం. ప్రతి రెండు సెకన్లకు ఒకరికి రక్తం అవసరం అవుతుంది. మీ రక్తదానం ఆ అవసరాన్ని తీర్చడంలో సహాయపడుతుంది. రక్తదానం చేయడం వల్ల రక్తదాతకు, రక్తం స్వీకరించే వ్యక్తికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఎన్ని నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు?. ఎవరెవరు దూరంగా ఉండాలి అనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం. రక్తదానం వల్ల కలిగే ప్రయోజనాలు: రక్తదానం చేయడం వలన దాత , గ్రహీత ఇద్దరికీ అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రక్తదానం యొక్క అతి ముఖ్యమైన ప్రయోజనం ఏమిటంటే, ఇది ప్రాణాలను రక్షించడంలో సహాయపడుతుంది. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవం లేదా రక్తహీనత వంటి వివిధ కారణాల వల్ల రక్తం కోల్పోయిన వారికి రక్తం అవసరం అవుతుంది. మీ రక్తదానం వారికి ప్రాణాపాయ స్థితి నుండి బయటపడటానికి సహాయపడుతుంది. దాత ఆరోగ్యానికి మేలు చేస్తుంది: రక్తదానం చేయడం వల్ల దాత ఆరోగ్యానికి కూడా కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. రక్తదానం చేసినప్పుడు, మీ శరీరం కొత్త రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. ఇది మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది . గుండె జబ్బులు , క్యాన్సర్ వంటి కొన్ని వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా, రక్తదానం చేసే ముందు, మీ రక్తపోటు, పల్స్, హిమోగ్లోబిన్ స్థాయిలను వైద్యులు పరీక్షిస్తారు. ఇది మీ ఆరోగ్య స్థితి గురించి మీకు తెలియజేస్తుంది . అవసరమైతే త్వరగా చికిత్స పొందడానికి సహాయపడుతుంది. సామాజిక బాధ్యత: రక్తదానం చేయడం అనేది ఒక ముఖ్యమైన సామాజిక బాధ్యత. సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు వస్తే, రక్త కొరతను నివారించవచ్చు. అవసరమైన వారికి సకాలంలో రక్తం అందించవచ్చు. రక్తదానం చేయడం వల్ల దాతకు మానసిక సంతృప్తి కలుగుతుంది. మరొకరికి సహాయం చేయడం , వారి ప్రాణాలను కాపాడటంలో భాగం కావడం వల్ల కలిగే ఆనందం చాలా గొప్పది. రక్తదానం చేయాలనే ఆసక్తి ఉన్నవారికి తలెత్తే ముఖ్యమైన ప్రశ్నలలో ఇది ఒకటి. సాధారణంగా, ఆరోగ్యవంతులైన వ్యక్తులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. ఎందుకంటే, మీ శరీరం రక్త కణాలను తిరిగి ఉత్పత్తి చేయడానికి , రక్తదానం చేసిన తర్వాత కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడానికి కొంత సమయం పడుతుంది. రక్తంలోని వివిధ భాగాల పునరుత్పత్తి సమయం వేర్వేరుగా ఉంటుంది. ప్లాస్మా 24–48 గంటల్లో, ప్లేట్‌లెట్స్ కొన్ని రోజుల్లో, ఎర్ర రక్త కణాలు 56 రోజుల్లో తిరిగి ఉత్పత్తి అవుతాయి. అందుకే 3 నెలల విరామం సురక్షితమైనది, ఆరోగ్యకరమైనదిగా పరిగణించబడుతుంది. అయితే, మీ ఆరోగ్య పరిస్థితి , వైద్యుల సలహా మేరకు ఈ సమయం మారవచ్చు. రక్తదానం చేయడానికి ముందు వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ఎలాంటి వారు రక్తదానం చేయకూడదు? రక్తదానం చేయడం చాలా మందికి సురక్షితమైనప్పటికీ, కొంతమంది వ్యక్తులు రక్తదానం చేయడానికి అర్హులు కాదు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు, 50 కిలోల కంటే తక్కువ బరువు ఉన్నవారు రక్తదానం చేయకూడదు. జ్వరం, జలుబు, దగ్గు లేదా ఏదైనా ఇతర ఇన్ఫెక్షన్ ఉన్నవారు పూర్తిగా కోలుకునే వరకు రక్తదానం చేయకూడదు. హెచ్ఐవి, హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, సిఫిలిస్ మరియు క్యాన్సర్ వంటి కొన్ని వ్యాధులు ఉన్నవారు రక్తదానం చేయకూడదు. గర్భిణీ, పాలిచ్చే తల్లులు రక్తదానం చేయకూడదు. టాటూలు లేదా పియర్సింగ్ చేయించుకున్నవారు కనీసం 6 నెలల వరకు రక్తదానం చేయకూడదు. రక్తహీనత ఉన్నవారు రక్తదానం చేయకూడదు. రక్తదానం చేయడానికి ముందు హిమోగ్లోబిన్ స్థాయిని పరీక్షించుకోవడం ముఖ్యం. తీవ్రమైన గుండె సమస్యలు ఉన్నవారు రక్తదానం చేయకూడదు. కొన్ని రకాల మందులు వాడుతున్నవారు రక్తదానం చేయడానికి అర్హులు కాదు. మీరు తీసుకుంటున్న మందుల గురించి వైద్యుడికి చెప్పడం ముఖ్యం. వంటల్లో వాడితే ఆరోగ్యానికి చిల్లులు పడినట్లేనా! రక్తదానం చేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు: రక్తదానం చేయడానికి ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. రక్తదానం చేయడానికి ముందు బాగా నీరు త్రాగాలి. ఆరోగ్యకరమైన భోజనం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. అంతే కాకుండా మీరు తీసుకుంటున్న మందుల గురించి వైద్యుడికి చెప్పాలి. రక్తదానం చేయడం అనేది ఒక గొప్ప విలువైన పని. ఇది మరొకరి ప్రాణాలను కాపాడటానికి , సమాజానికి సహాయం చేయడానికి ఒక అద్భుతమైన అవకాశం. మీరు రక్తదానం చేయడానికి అర్హులైతే, తప్పకుండా రక్తదానం చేయండి. మీ రక్తదానం ఎవరికో ఒకరికి ప్రాణదానం చేయగలదు! రక్తదానం చేయడానికి ముందు మీ దగ్గర్లోని రక్తదాన కేంద్రాన్ని సందర్శించి, మరింత సమాచారం తెలుసుకోవడం మంచిది. మీ ఆరోగ్యం ,ఇతరుల ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించండి. రక్తదానంతో జీవితంలో వెలుగునింపండి.


# ఆవనూనె వాడకంపై నిషేధం.. వంటల్లో వాడితే ఆరోగ్యానికి చిల్లులు పడినట్లేనా!

భారతీయ వంటకాలలో సుగంధ ద్రవ్యాలు, నూనెలు, సాంప్రదాయ పదార్థాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇవి కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి. అలాంటి వాటిలో ఆవనూనె ఒకటి. ఘాటైన వాసన , రుచితో కూడిన ఈ నూనె. భారతీయ గృహాలలో విరివిగా ఉపయోగిస్తారు. వంటకాల రుచి కోసం ఈ ఆవనూనెను మనం ఆస్వాదిస్తూనే ఉన్నాము. అయితే, విచారకరమైన విషయం ఏమిటంటే, ఇది అమెరికా , అనేక ఇతర దేశాలలో నిషేధించబడింది.. ఆవనూనెపై నిషేధం వెనుక కారణం ఏమిటి? అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఈఆం) ప్రకారం, ఆవనూనెలో ఎరుసిక్ యాసిడ్ అనే కొవ్వు ఆమ్లం అధిక మొత్తంలో ఉంటుంది. ఈ ఎరుసిక్ యాసిడ్ ఆరోగ్యానికి హానికరం. ఇది జీవక్రియకు అంత మంచిది కాదు. మెదడు కణాలను దెబ్బతీస్తుంది. జ్ఞాపకశక్తి క్షీణత వంటి అనేక మానసిక రుగ్మతలతో కూడా ఎరుసిక్ యాసిడ్ ముడిపడి ఉంది. అంతేకాకుండా, ఇది శరీరంలో కొవ్వు పేరుకుపోవడానికి కూడా కారణమవుతుంది. ఈ కారణాల దృష్ట్యా, అమెరికా, కెనడా , యూరప్ దేశాలు ఆవనూనె వినియోగాన్ని నిషేధించాయి. ఎరుసిక్ యాసిడ్: ఆరోగ్యానికి శత్రువా? ఎరుసిక్ యాసిడ్ అనేది మోనోఅన్‌శాచురేటెడ్ ఒమేగా–9 కొవ్వు ఆమ్లం, ఇది సాధారణంగా ఆవనూనె, రేప్‌సీడ్ నూనె, వాల్‌ఫ్లవర్ సీడ్ నూనె వంటి నూనెల్లో కనిపిస్తుంది. అధ్యయనాల ప్రకారం, అధికంగా ఎరుసిక్ యాసిడ్ తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. గుండె, కాలేయానికి ముప్పు: అధిక స్థాయిలో ఎరుసిక్ యాసిడ్ గుండె కండరాల కణాలలో కొవ్వు పేరుకుపోయే మైయోకార్డియల్ లిపిడోసిస్‌కు దారితీస్తుంది. ఇది ఫ్యాటీ లివర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఇది కాలేయ సాధారణ పనితీరును దెబ్బతీస్తుంది. శారీరక ఎదుగుదల మందగించడం: జంతువులపై చేసిన అధ్యయనాలలో, అధిక స్థాయిలో ఎరుసిక్ యాసిడ్ తీసుకోవడం వల్ల ఎదుగుదల మందగించడం , బరువు తగ్గడం వంటి సమస్యలు కనిపించాయి. ఇది మానవులలో, ముఖ్యంగా పిల్లలలో ఎదుగుదల, అభివృద్ధిపై ప్రభావం చూపుతుందనే ఆందోళనలను పెంచుతోంది. అంతే కాకుండా .. దీనిని అధిక మొత్తంలో ఎరుసిక్ యాసిడ్ తీసుకోవడం వల్ల విరేచనాలు, కడుపు నొప్పి, వికారం వంటి జీర్ణశయాంతర సమస్యలు వస్తాయి. అధ్యయనాలు అధిక స్థాయిలో ఎరుసిక్ యాసిడ్ పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సూచిస్తున్నాయి. అయితే, మానవులలో ఈ ప్రభావాలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి మరింత పరిశోధన అవసరం. ఖచ్చితంగా నిరూపించబడనప్పటికీ, దీర్ఘకాలికంగా అధిక స్థాయిలో ఎరుసిక్ యాసిడ్ తీసుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కొంత ఆందోళన ఉంది. పరిష్కార మార్గాలు ఉన్నాయా? నివేదికల ప్రకారం, ఆవనూనె వినియోగాన్ని నిషేధించిన దేశాలు భద్రతా చర్యలపై దృష్టి సారించాయి. ఆండర్సన్ ఇంటర్నేషనల్ కార్ప్ ప్రకారం, ఈ నూనెలో ఎరుసిక్ యాసిడ్ పరిమాణాన్ని తగ్గించడానికి పరిశోధన , అభివృద్ధి జరుగుతున్నాయి. కెనడియన్ పరిశోధకులు 1950లలో తక్కువ ఎరుసిక్ యాసిడ్ కలిగిన రేప్‌సీడ్ రకాన్ని అభివృద్ధి చేశారు, దానికి కెనోలా అని పేరు పెట్టారు. కెనోలా అంటే “కెనడియన్ ఆయిల్ విత్ లో యాసిడ్” యొక్క సంక్షిప్త రూపం. ఈఆం తక్కువ ఎరుసిక్ యాసిడ్ స్థాయిల కోసం ప్రత్యేకంగా ఉత్పత్తి చేయబడిన ఒక బ్రాండ్ తినదగిన ఆవ గింజల నూనెను ఆమోఇతర దుష్ప్రభావాలు ఏమిటి? ఆవనూనె ఘాటైన స్వభావం కలిగి ఉండటం వల్ల అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు, అజీర్ణం వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. అలాగే, ఆవనూనెలో గోయిట్రోజెన్లు ఉంటాయి. ఈ పదార్థాలు థైరాయిడ్ గ్రంథి పనితీరుకు ఆటంకం కలిగిస్తాయి.

# బాన పొట్ట తగ్గాలా? అయితే ఈ పండ్లు తినండి చాలు!



ప్రస్తుతం సమాజంలో ఎక్కువమందిని ఇబ్బంది పెడుతున్న సమస్య ఊబకాయం ఒకటే కాదు బాన పొట్ట. ఇది మరింత ఇబ్బందికరంగా మారిన సమస్య. చాలామంది పొట్ట తగ్గడం కోసం రకరకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు ఎన్ని వ్యాయామాలు చేసిన బెల్లీ ఫ్యాట్ తగ్గలేదని చాలా బాధపడుతూ ఉంటారు. బెల్లీ ఫ్యాట్ తగ్గించే పండ్లు అటువంటివారు బెల్లీ ఫ్యాట్ తగ్గడం కోసం సరైన డైట్ ను చేస్తే మంచిదని సలహా ఇస్తున్నారు డైటీషియన్లు. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లతో బెల్లీ ఫ్యాట్ ను కంట్రోల్ చేయవచ్చని చెబుతున్నారు. ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లు బెల్లీ ఫ్యాట్ తగ్గేందుకు ఉపయోగపడతాయని అంటున్నారు. బెర్రీలు, జామ పండ్లు స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, బ్లాక్ బెర్రీ వంటి పండ్లతో బెల్లీ ఫ్యాట్ ను తగ్గించవచ్చని చెబుతున్నారు వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ పొట్ట తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తాయని సూచిస్తున్నారు. జామ పండు కూడా బెల్లీ ఫ్యాట్ తగ్గిస్తుంది. జామ పండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది, ఇది ఆకలిని తగ్గిస్తుంది . కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. ఫలితంగా పొట్ట తగ్గుతుంది. యాపిల్స్ ప్రతిరోజు యాపిల్ పండ్లను తినటం కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, యాపిల్ పండ్లలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల ఇది మన ఆకలిని తగ్గిస్తుందని అంటున్నారు. అతిగా తినడాన్ని నిరోధించి పొట్ట తగ్గేందుకు దోహదం చేస్తుందని చెబుతున్నారు. యాపిల్ పండును ప్రతిరోజు తింటే వెయిట్ తగ్గుతారని సూచిస్తున్నారు ఇంకా ద్రాక్ష పండ్ల లో కూడా మన బరువును తగ్గించి, పొట్టను తగ్గించే ఎన్నో పోషకాలు ఉంటాయి. ద్రాక్ష పండ్ల లో ఉండే పోషకాలు మన ఇన్సులిన్ స్థాయిలను కూడా తగ్గిస్తాయని, తద్వారా బరువు తగ్గుతుందని అంటున్నారు.ఇక బెల్లీ ఫ్యాట్ ను తగ్గించడంలో నారింజ పండ్లు, బొప్పాయి ఎంతో బాగా ఎ ని చే న్తా య ని చెబుతున్నారు.పైనాపిల్, కివీ పండ్లు పైనాపిల్ బరువు తగ్గడానికి, పొట్ట తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. పైనాపిల్లో బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది కడుపు బ్లోటింగ్ ను తగ్గిస్తుంది. కివి పండ్లు కూడా పొట్ట తగ్గడానికి ఎంతగానో దోహదం చేస్తాయి. వీటిల్లో ఉండే విటమిన్ సి, ఫైబర్ పొట్ట తగ్గిస్తాయి. కనుక బెల్లీ ఫ్యాట్ తగ్గాలని భావించేవారు బరువు, బెల్లీ ఫ్యాట్ ను తగ్గించే ఈ పండ్లను తప్పకుండా ఆహారంలో భాగంగా చేసుకోండి.




# మామ అల్లుళ్ల 10కోట్లతో జాయింట్ వెంచర్



ఈ సెలబ్రిటీ మామా అల్లుళ్లు ముంబైను ఆనుకుని ప్రధాన ఏరియాలో 10కోట్ల ధరకు ఏడెకరాలు కొనుగోలు చేసారు. ఈ ఏడెకరాలు పదేళ్లలో 50కోట్లు పలికినా ఆశ్చర్యపోనవసరం లేదు. అభివృద్ధికి చేరువలో ఉన్న ఔట్ స్కర్ట్స్ ఇన్వెస్టిమెంట్ కావడంతో ఈ డీల్‌పై చాలా చర్చ సాగుతోంది. ఇంతకీ ఎవరీ మామా అల్లుళ్లు అంటే? వివరాల్లోకి వెళ్లాలి. భారత క్రికెటర్ కెఎల్ రాహుల్ - బాలీవుడ్ నటుడు సునీల్ శెట్టికి అల్లుడు అన్న సంగతి తెలిసిందే. శెట్టి కుమార్తె ఆథియాను రాహుల్ పెళ్లాడాడు. ఈ జంటకు ఒక బిడ్డ జన్మించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సునీల్-రాహుల్ జోడీ సంయుక్తంగా థానే వెస్ట్‌లోని ఓవాలేలో 7 ఎకరాల భూమిని రూ.9.85 కోట్లకు కొనుగోలు చేశారు. మార్చి 2025లో నమోదైన ఈ లావాదేవీ వివరాల ప్రకారం... 30 ఎకరాల 17-గుంటల పెద్ద ప్లాట్‌లో ఈ ఏడెకరాలు భాగం అని తెలుస్తోంది. ఆస్తి రిజిస్ట్రేషన్ పత్రాలు ఈ ఒప్పందాన్ని ధృవీకరిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ లో భారీ పెట్టుబడులు పెడుతూ ఆర్జిస్తున్న సెలబ్రిటీల మనస్తత్వానికి ఇది అద్దం పడుతుంది. ఈ లావాదేవీలో రూ.68.96 లక్షల స్టాంప్ డ్యూటీ, రూ.30,000 రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఉన్నాయి. ఈ ఆస్తి ఘోడ్బందర్ రోడ్డు సమీపంలో థానే వెస్ట్‌లో ఉన్న ఓవాలే, ఆనంద్ నగర్, కాసర్వాడవాలి మధ్య ఉంది. ఇది ఘోడ్బందర్ రోడ్డు వెంబడి విస్తరించి ఉంది. థానే వెస్ట్‌ను తూర్పు పశ్చిమ ఎక్స్‌ప్రెస్ హైవేలకు అనుసంధానించే కీలక మార్గం. ఈ ప్రధాన స్థానం థానే, ముంబై, పశ్చిమ శివారు ప్రాంతాలలోని ప్రధాన వ్యాపార కేంద్రాలకు అనువుగా మారుతోంది. సునీల్ శెట్టి- కె.ఎల్.రాహుల్ ఎంపిక ఆ ప్రాంతంలోని భవిష్యత్ అభివృద్ధిని సూచిస్తోంది. జూలై 2024లో కె.ఎల్. రాహుల్ అతడి భార్య అతియా శెట్టి, బాంద్రాలోని పాలి హిల్‌లో రూ.20 కోట్లకు 3,350 చదరపు అడుగుల అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశారు. అదే సమయంలో సునీల్ శెట్టి అతడి కుమారుడు అహన్ శెట్టి ఖార్ ప్రాంతంలో రూ.8.01 కోట్లకు 1,200 చదరపు అడుగుల ఆస్తిని కొనుగోలు చేశారు కె.ఎల్.రాహుల్ భారత క్రికెట్ టీమ్ లో స్థిరమైన ఆటగాడిగా పాపులరయ్యారు. ఆథియా శెట్టి ప్రస్తుతానికి నటనకు విరామం ఇచ్చారు. సునీల్ శెట్టి సీనియర్ నటుడు, వ్యవస్థాపకుడు. 100 కి పైగా చిత్రాలలో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన కృషికి ప్రతిష్టాత్మక రాజీవ్ గాంధీ అవార్డును అందుకున్నారు. నటనకు మించి శెట్టి ఫిట్‌నెస్, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ రంగాలలో తనదైన ముద్ర వేశారు. వినోద పరిశ్రమ వెలుపల భారీ బిజినెస్ లతో స్థిరపడ్డారు.

# రిలీజైన పదేళ్ల తర్వాత స్పానిష్ భాషలోకి


: ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వం వహించిన 'బాహుబలి: ది బిగినింగ్' దక్షిణ భారత సినిమాను దేశవ్యాప్తంగా ప్రజలు చూసే విధానాన్ని మార్చడమే కాకుండా, సౌత్ నుండి వచ్చే ప్రతిష్టాత్మక చిత్రాలకు ప్రపంచవ్యాప్త మార్కెట్ కు మార్గం సుగమం చేసింది. ప్రపంచవ్యాప్తంగా సౌత్ వెలిగిపోయేలా చేసిన సినిమా ఇది.మొదటి భాగం 2015లో విడుదలైంది. ఇది భారతీయ సినిమాను శాశ్వతంగా మార్చేసిన ఘనతను అందుకుంది. అసలు పాన్ ఇండియా అనే పదం బలంగా వెళ్లూనుకున్నది ఈ సినిమా రిలీజ్ తర్వాతే. అంతకుముందు చాలా పాన్ ఇండియన్ సినిమాలు వచ్చినా వాటికి ఈ స్థాయి ప్రచారం లేదు. ఇరుగు పొరుగున కలెక్షన్లలో ఈ స్థాయి ప్రభంజనం సృష్టించలేదు. బాహుబలి చిత్రం భారతదేశం, అమెరికా, బ్రిటన్, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, గల్ఫ్ లాంటి చోట్ల రిలీజ్ చేయగా గొప్ప ప్రజాదరణ పొందింది. ఆ తర్వాత ప్రభాస్ నటించిన చాలా సినిమాలు ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్నాయి. ఇప్పుడు 'బాహుబలి: ది బిగినింగ్' స్పానిష్-డబ్బింగ్ వెర్షన్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కి రెడీ అవుతోంది. థియేటర్లలో విడుదలైన దాదాపు 10 సంవత్సరాల తర్వాత మరో కొత్త భాషలోను



విడుదలవుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది. ఇంతకాలం తర్వాత, నెట్‌ఫ్లిక్స్ అకస్మాత్తుగా స్పానిష్-డబ్బింగ్ వెర్షన్‌ను విడుదల చేయాలని నిర్ణయించుకోవడానికి కారణమేమిటీ? యూరోపియన్ మార్కెట్‌లో దక్షిణ భారత సినిమా పరిధిని విస్తరించాలనే ఆలోచన దీని వెనక పని చేస్తోందా? నెట్‌ఫ్లిక్స్ యూరోపియన్ ప్రేక్షకులకు అత్యంత అందుబాటులో ఉన్న ఇవు ప్లాట్‌ఫామ్‌లలో ఒకటి. ఇప్పుడు తెలుగు సినిమాని నెమ్మదిగా యూరోపియన్లకు ఎక్కించే ప్రయత్నం చేస్తోందా? దీనిని అద్భుతంగా ప్రారంభించడానికి బాహుబలి: ది బిగినింగ్ కంటే మంచి మార్గం మరొకటి లేదని భావించి ఉండాలి. ఈ ఎపిక్ బ్లాక్‌బస్టర్ భారతీయ సినిమాను రీడిఫైన్ చేసింది. థియేటర్ల నుంచి దాదాపు 650 కోట్లకు పైగా వసూలు చేసింది. బాహుబలి 1 స్పానిష్ లో ఎలాంటి ఆదరణ దక్కించుకుంది? అన్నదానిని బట్టి తదుపరి బాహుబలి ది కన్ క్లూజన్ సహా చాలా ప్రభాస్ సినిమాలను నెట్ ఫ్లిక్స్ స్పానిష్ లోకి డబ్ చేసి విడుదల చేసేందుకు అవకాశం ఉంది. కేవలం స్పానిష్ మాత్రమే కాదు, ఇతర యూరోపియన్ భాషలలో కూడా ఆజానుబాహుడైన ప్రభాస్ సినిమాలను విడుదల చేయడానికి ప్రేరేపించే వీలుంది. అయితే స్పానిష్-డబ్బింగ్ వెర్షన్ 'బాహుబలి: ది బిగినింగ్' 2 గంటల 17 నిమిషాల రన్‌టైమ్‌ను కలిగి ఉంది. హిందీ, తెలుగు వెర్షన్‌లకు 2 గంటల 38 నిమిషాలు, తమిళ వెర్షన్‌కు 2 గంటల 39 నిమిషాలు నిడివి ఉంది. స్పానిష్ వెర్షన్ లో చాలా వరకూ కట్స్ చెబుతారని కూడా భావిస్తున్నారు.

# ప్రభాస్‌తో దీపిక.. పృథ్వీరాజ్‌తో కరీనా?





బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌లు దిగి వస్తున్నారు. ఇటీవలి కాలంలో సౌత్ లో ఏ హీరోతో అవకాశం వచ్చినా వదులుకునేందుకు హిందీ భామలు సిద్ధంగా లేరు. మునుపటితో పోలిస్తే ఇప్పుడు ట్రెండ్ రివర్స్‌లో ఉంది. సౌత్ స్టార్లను ఉత్తరాది భామలంతా రౌండప్ చేస్తున్నారు. ఇక్కడి స్టార్లను పాన్ ఇండియా స్టార్లుగా పరిగణిస్తున్నారు. ప్రభాస్ సరసన ఇప్పటికే దీపిక పదుకొనే, దిశా పటానీ, శ్రద్ధా కపూర్ లాంటి టాప్ బాలీవుడ్ భామలు నటించారు. తదుపరి మహేష్ సరసన ప్రియాంక చోప్రా లాంటి అగ్ర కథానాయిక నటిస్తోంది. ఇంతలోనే ఇప్పుడు మరో సౌత్ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ సరసన బాలీవుడ్ అగ్ర కథానాయిక కరీనా కపూర్ ఖాన్ నటిస్తోందని తెలుస్తోంది. మేఘనా గుల్జార్ దర్శకత్వం వహిస్తున్న 'దైరా' చిత్రంలో కరీనా కపూర్ తో కలిసి పృథ్వీరాజ్ సుకుమారన్ నటించనున్నారు. దైరా క్రైమ్ థ్రిల్లర్ కథాంశం.. హారర్ ఎలిమెంట్స్ తో రక్తి కట్టించనుందని సమాచారం. దెయ్యం ఉందా లేదా? అనే ఎలిమెంట్ ని తెరపై ఆవిష్కరిస్తున్నారు. కరీనా తొలిసారిగా పృథ్వీరాజ్ తో తెరపై జతకడుతోంది. మేఘనా, అద్భుతమైన కరీనా కపూర్ ఖాన్, టీం జంగ్లీ పిక్చర్స్‌తో కలిసి పనిచేయడానికి ఉత్సాహంగా ఉంది! అని అతడు వ్యాఖ్యానించాడు. దైరా కంటే ముందు, మేఘనా గుల్జార్ పలు బ్లాక్ బస్టర్ చిత్రాలను తెరకెక్కించారు. రాజీ, చపక్, సామ్ బహదూర్ వంటి కొన్ని హార్డ్ హిట్టింగ్ సినిమాలకు మేఘనా దర్శకత్వం వహించారు. దైరా చిత్రాన్ని పాన్ ఇండియా రేంజులో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇటీవలే ప్రభాస్ 'సలార్' చిత్రంతో పృథ్వీరాజ్ పేరు మార్మోగింది. అలాగే అతడు బాలీవుడ్ అగ్ర హీరోల సినిమాల్లో విలన్ గా నటించాడు. ఎల్2 ఎంపురాన్ తో దర్శకనటుడిగా మరోసారి అతడి పేరు మార్మోగింది. ఇలాంటి సమయంలో పృథ్వీరాజ్ మరొక హిందీ ప్రాజెక్ట్‌పై సంతకం చేసి, అదే విషయాన్ని తన సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. బెబో కరీనాతో స్క్రీన్ చేసుకోవడంపై తన ఉత్సాహాన్ని ప్రకటించాడు.



# చూడముచ్చటగా అందాల రాశి

: 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రాశి ఖన్నా. అంతకు ముందు తెలుగులో మనం, హిందీలో మద్రాస్ కేఫ్ సినిమాల్లో నటించింది. ఆ రెండు సినిమాలు పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. కానీ 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు, కమర్షియల్ బ్రేక్‌ను సొంతం చేసుకుంది. దాంతో ఈ అమ్మడు తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా బిజీ అయింది. అందమైన ఈ అమ్మడికి టాలీవుడ్‌లో యంగ్ హీరోలకు జోడీగా వరుస సినిమాలు చేసే అవకాశం దక్కింది. అంతే కాకుండా టైర్ 2 హీరోలకు మోస్ట్ వాంటెడ్‌గా మారింది.ఒకానొక సమయంలో కాస్త బరువు ఎక్కువగా ఉన్న రాశి ఖన్నా సౌత్ ఇండస్ట్రీలో సక్సెస్‌ల కోసం, ఆఫర్ల కోసం సన్నబడింది. సహజ పద్దతిలో వర్కౌట్స్ చేస్తూ బరువు తగ్గింది. బరువు తగ్గి, సన్నగా నాజూకుగా కనిపించడం ద్వారా టాలీవుడ్‌లో మరిన్ని సినిమాలను ఈ అమ్మడు సొంతం చేసుకుంది. రాశి ఖన్నా ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాల కంటే హిందీ, తమిళ్ సినిమాల్లో నటిస్తోంది. ప్రస్తుతం తెలుగు కదా అనే ఒకే ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది. హిందీలో ఈ అమ్మడు సినిమాలు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. తెలుగులో ఈమె దక్కించుకున్న విజయాలను మరే భాషలోనూ దక్కించుకోలేక పోయింది.ఎట్టకేలకు తమన్ ఓపెన్.. ఇన్‌స్టాగ్రామ్‌లో 12 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న రాశి ఖన్నా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన క్యూట్ అందమైన ఫోటోను షేర్ చేసింది. చీర కట్టులో, పాపట బిల్ల పెట్టుకుని, సింపుల్ హెయిర్ స్టైల్‌తో, చేతికి గాజులు ధరించి పద్దతైన అమ్మాయిగా రాశి ఖన్నా లుక్‌తో మెస్మరైజ్ చేసింది. వావ్ అంటూ ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయే విధంగా స్టిల్ ఇచ్చింది. అలా సైడ్‌కి చూస్తూ ఉన్న రాశి ఖన్నాను నెటిజన్స్ తెగ లైక్ చేస్తున్నారు. రాశి ఖన్నా షేర్ చేసిన కొన్ని గంటల్లోనే లక్షకు పైగా లైక్స్‌ను దక్కించుకుంది. ఈమె అందంకు ఎంతో మంది లవ్ ఈమోజీలు షేర్ చేస్తూ తమ అభిమానం పంచుకున్నారు. తెలుగులో ఈమె ఊహలు గుసగుసలాడే సినిమా తర్వాత జోరు, జిల్, శివం, బెంగాల్ టైగర్, సుప్రీమ్, హైపర్, జై లవకుశ, ఆక్సీజన్, టచ్ చేసి చూడు ఇలా వరుసగా పెద్ద సినిమాల్లో నటించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. పలు సినిమాలు సూపర్ హిట్ కాగా కొన్ని సినిమాలు యావరేజ్ టాక్‌ను సొంతం చేసుకున్నాయి. కానీ ఈమె స్టార్ హీరోకు జోడీగా జై లవకుశలో తప్ప మరే సినిమాలో నటించే అవకాశాన్ని దక్కించుకోలేక పోయింది. నటిగా ప్రస్తుతం బిజీగా ఉన్నప్పటికీ ఇంకాస్త జోరు పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రాశి ఖన్నాకు తెలుగులో మరిన్ని ఆఫర్లు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.



## తిరుమలలో విఐపిలకే ప్రాధాన్యం

### సామాన్యులకు దక్కని దర్శనభాగ్యం

తిరుమల,ఏప్రిల్16: తిరుమలలో వేసవి రద్దీ కొనసాగుతోంది. కంపార్ట్‌మెంట్లో నిండి బయటకు క్యూలు కడుతున్నారు. ఏటా ఇదే తంతు సాగుతోంది. విఐపిలు పదేపదే రావడంతో వారికోసం దర్శనాలను నిలిపివేస్తున్నారు. వారి రాకను నియంత్రిస్తామన్న హామీ నెరవేరడం లేదు.తిరుమల శ్రీవారిని సామాన్యులు మాత్రమే దర్శించుకునేలా ఆంక్షలు విధించాలని భక్తులుకోరుతున్నారు. రద్దీ ఉన్న సమయాల్లోనూ విఐపిలు రావడం వల్ల తీవ్రిబ్బందులు కలుగుతున్నాయని, సామాన్యులకు దర్శనం కలగడం లేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. భక్తులు తమ ఆపదల మొక్కులు తీర్చుకోవడానికి వస్తారని అలాంటి సమయంలో ఆంక్షలు విధించడం సరికాదన్నారు. అయినా దేవుడికి భక్తుడికి మధ్య అధికారుల పెత్తనం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తిరుమలలో ముందు భక్తులకు సత్వర దర్శనం కలిగేలా విఐపిలను నియంత్రించాలని అన్నారు. ఆ నిబంధనేదో ముందు ప్రజాప్రతినిధులకు విధించాలని అంటున్నారు. తిరుమల ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుణ్యక్షేత్రం. కావడంతో దేశ విదేశాల నుంచి భక్తులు శ్రీవారిని దర్శించుకుంటారు. ప్రశాంతతకు మారుపేరు తిరుమల.. అయితే పెత్తనం చెలాయించాలను కోవడం సరికాదు. ఇకపోతే ఇటీవల ఇక్కడ అన్యమత ప్రచారాలు, మద్యం, మాంసం తదితర విషయాల్లో కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పాలన

### అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

గుంటూరు,ఏప్రిల్16: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రిచంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జివి ఆంజనేయులు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. రాష్ట్రం ఎటువంటి పరిస్థితుల్లో ఉందో ప్రజలకు వివరించి, పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏవిధంగా కష్టపడుతున్నదో తెలియజేయాలని సూచించారు.పరిశ్రమల స్థాపనతో ఉద్యోగాల కల్పన సాధ్యమవుతోందని, ఆ దిశగా ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు.

## లాభదాయక పంటలపై ప్రోత్సాహం

కడప,ఏప్రిల్16 జిల్లాలో ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసే అన్నదాతకు మంచి ఆదాయం వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయాధికారులు అన్నారు. ఇదివరకు సాగు చేసే పంటలతో రైతు ఎలాంటి లాభ నష్టాలను చవి చూశారు, అందుకు కారణాలను కూడా సదరు ప్రణాళికలో ప్రధానంగా ప్రస్తావించాలని ఆదేశించారు. వరి, వేరుసెనగ, పత్తి, మినుము, సజ్జ, జొన్న, తదితర పంటలు జిల్లాలో సాగు చేస్తుంటారని అన్నారు. మట్టి నమూనాలు సేకరించి ప్రయోగ శాలలకు పంపాలని, పంపిన నమూనాలకు పరీక్షలు పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్‌లో వ్యవసాయాధి కారులు పొలం బాట పట్టాల్సి ఉంటుందన్నారు. వచ్చే ఖరీఫ్‌లో రైతులు ఏ పంటలు సాగు చేస్తే నష్టపోకుండా ఉంటారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు సాగు చేయాలి, తదితర అంశాలతో వ్యవసాయాధి కారులు ప్రణాళిక తయారు చేసి జేడీ కార్యాలయానికి పంపాలన్నారు. ఆయా మండల వ్యవసాయాధి కారులు తమ ప్రాంతాల్లో ఏ పంటలు బాగా సాగు చేస్తారు, అక్కడ ఆ పంటలకు భూమి అనుకూల మైనదేనా? అనేది గమనించి ప్రణాళికలో పేర్కొనాలన్నారు.

## శ్రీశైలం దారిలో వన్యప్రాణుల రక్షణ

### వాహనాలపై నిషేధంతో సత్ఫలితాలు

శ్రీశైలం,ఏప్రిల్16: నల్లమల అటవీ ప్రాంతమైన హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై రాత్రివేళ ప్రయాణలను నిషేధించిన తరవాత సత్ఫలితాలు ఇస్తున్నాయని స్థానికులు అంటున్నారు. వాహనాల వేగం నిరోధించాలని అన్నారు. ఇక్కడ వాహనాల వేగం కారణంగా అటవీ జంతువులు వాటి కింద పడి చనిపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. దీంతోపాటు రాత్రివేళ ఈ మార్గంలో వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. అటవీ ప్రాంతంలో జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న వాహనాల వల్ల పలు వన్యప్రాణులు మరణించిన నేపథ్యంలో కొత్తగా వాహనాల వేగనియంత్రణకు చర్యలు తీసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఇటీవల స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, వైద్యులు, ఇంజనీర్లతో జరిపిన వన్యప్రాణుల సర్వేలో వెల్లడైన వాస్తవాలతో ఇకనుంచి వన్యప్రాణుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీంతోపాటు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు నల్లమల అటవీ ప్రాంతం గుండా వెళ్లే జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిషేధించాలని నిర్ణయించారు. అభయారణ్యంలో రోడ్డు ప్రమాదాల బారినుంచి వన్యప్రాణుల పరిరక్షణ కోసం హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలు 40 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా నడపరాదని తెలంగాణ సర్కారు ఆదేశాలు జారీ చేసింది.

## భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

న్యూఢిల్లీ,ఏప్రిల్16): భారత స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ముగిశాయి. బుధవారం ఉదయం గ్యాప్ డౌన్ తో స్టార్ట్ అయిన మార్కెట్లు-.. నిమిషాల వ్యవధిలోనే కోలుకొని బుల్ ర్యాలీ తీశాయి. మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 309.40 పాయింట్లు (0.40 శాతం) లాభంతో.. 77,044.29 వద్ద, నిఫ్టీ 108.65 పాయిం(0.47శాతం) లాభంతో.. 23,437.20 పాయింట్ల వద్ద నిలిచాయి. నిఫ్టీ రెండు వారాల గరిష్ఠ స్థాయిని తాకడం మరో విశేషం. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 738.25 పాయింట్లు-(1.41 శాతం) పెరిగి 53,117.75 వద్ద, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 371 పాయింట్లు- పెరిగి 52,345 వద్ద స్థిరపడటంతో మార్కెట్ సెంటిమెంట్ ఉత్సాహంగా ఉంది.

# ప్లేస్‌మెంట్‌లో పెద్ద విజయం - నేషనల్ డిగ్రీ కళాశాల నుంచి 70 మంది మల్టీనేషనల్ కంపెనీలకు ఎంపిక

నంద్యాల(విజయ సారథి):నేషనల్ డిగ్రీ కళాశాల కు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు 70 మంది వివిధ మల్టీ నేషనల్ కంపెనీ లలో ఉద్యోగాలు సాధించినట్లు నేషనల్ విద్యా సంస్థల అధినేత డా. యస్. ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు.. బుధవారం నాడు కళాశాల ప్రాంగణం లో ప్లేసెమెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజేతల అభినందన కార్యక్రమం నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024..2025 విద్యా సంవత్సరంలో తమ కళాశాలలో బి. సి. ఏ., బి. యస్. సి(కంప్యూటర్స్)., బి. కామ్. (కంప్యూటర్స్) తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు విప్రో టెక్నాలజీస్.. 16, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ( టి సి ఎస్).. 27, ఫాక్సకాన్ కంపెనీ10, అమెజాన్ 3, డాలాయిట్.. 2 ఇన్ఫోసిస్.. 2, కాల్క్ టెక్నాలజిస్.. 5, ట్రూ ప్రాజెక్ట్స్.. 10..అలసెట్ బిజినెస్ సొల్యూషన్స్.. 4..ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.. 1994 లో కళాశాల స్థాపించిన నాటి నుండి నేటి వరకు తమ కళాశాల విద్యార్థులు ప్రతీ సంవత్సరం వందల మంది విద్యార్థులు ప్రముఖ బహుళ జాతి సంస్థలు నిర్వహించే ప్రాంగణ ఎంపికలలో తమ ప్రతిభ కనబరచి ఉద్యోగాలను సాధిస్తూ, కళాశాల కీర్తిని ఇనుమడింప జేసినట్లు తెలిపారు... తమ కళాశాలలో చదివే ప్రతీ విద్యార్థికి డిగ్రీ పట్టా తో పాటు కనీసం ఒక కంపెనీ లో ఉద్యోగాన్ని కల్పించాలనే సంకల్పం తో తాము చేస్తున్న కృషికి ఈ రోజు మా విద్యార్థులు సాదించిన ఈ అద్భుత ఫలితాలు నిదర్శనం గా నిలుస్తాయని అన్నారు.. ఇంకో 45మంది విద్యార్థులు వివిధ కంపెనీల ఇంటర్వ్యూ లకు హాజరై, తుది ఫలితాల కొరకు ఎదురు చూస్తున్నారని తెలిపారు.. ఉద్యోగాలు సాధించిన ప్రతీ విద్యార్థికి కంపెనీ ద్వారా వచ్చిన నియామక పత్రాలను ఆయన అందజేశారు.. ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు సాధిచేలా విద్యార్థులకు కావలసిన నైపుణ్యాలను అందించి, వారిని విజేతలు గా నిలపడంలో నిరంతర కృషి చేసిన డిగ్రీ కళాశాల ప్లేసెమెంట్ అధికారి సాయికుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ లను ఆయన అభినందించారు..

విద్యార్థుల ప్రతిభకు రుజువు: టీసీఎస్, విప్రో, అమెజాన్ వంటి దిగ్గజాల్లో ఉద్యోగాలు

డిగ్రీతో పాటు ఉద్యోగం లక్ష్యం ? నేషనల్ కళాశాల దిశగా విజయమైన అడుగులు

ప్లేసెమెంట్ ఘనవిజయం ? సాయి కుమార్, వేణుగోపాల్ కు అభినందనలు

భవిష్యత్ బలంగా నేషనల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు- ఉద్యోగాలుగా విజయగాథ నేషనల్ డిగ్రీ విద్యార్థుల ప్రాభవం

మల్టీనేషనల్ కంపెనీలకు నేషనల్ డిగ్రీ స్టూడెంట్స్ హాట్ పిక్స్




## తిరుమల తులాభారం కానుకల గోల్‌మాల్

### గత వైకాపా హయాంలో కాజేశారు

### టిటిడి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి ఆరోపణ

తిరుమల,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిరుమల శ్రీవారి ఆలయంలో భారీ స్కాం జరిగిందని, కోట్లాది రూపాయల తులాభారం కానుకలను ఇంటి దొంగలు కాజేసారని టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మీడియాతో మాట్లాడుతూ.. స్వామి వారికి మొక్కులు చెల్లింపులో భాగంగా భక్తులు వివిధ రూపంలో తులాభారం సమర్పిస్తారని, తులా భారం ద్వారా నిత్యం 10 లక్షల రూపాయలు.. కానుకలను భక్తులు సమర్పిస్తున్నారన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కోట్లాది రూపాయల తులా భారం కానుకలను స్వాహా చేశారన్నారు. తులా భారంలో అక్రమాలు జరిగినట్లు విజిలేన్స్ నివేదిక ఇస్తే.. అధికారులు తాత్కాలిక ఉద్యోగులను తొలగించి మిన్నకుండిపోయారని భానుప్రకాష్ రెడ్డి విమర్శించారు. తులా భారంలో అక్రమాలపై విజిలేన్స్ విచారణకు డిమాండ్ చేస్తున్నామన్నారు. శ్రీవారి ఆలయం వద్ద డ్రోన్ ఎగరడం.. నిఘా వైఫల్యంగా భావిస్తున్నామన్నారు. భద్రతా సిబ్బంది కొరత వుందని.. సిబ్బందిని కూడా పెంచుతామని ఆయన తెలిపారు. త్వరలోనే యాంటీ డ్రోన్ టెక్నాలజీని తీసుకొస్తామని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. కాగా తిరుమల శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతంలో మంగళవారం డ్రోన్ ఎగరడం కలకలం రేపింది. అత్యంత పవిత్రమైన, భద్రతాపరంగా కీలకమైన ఈ ప్రాంతంలో డ్రోన్ కెమెరాను అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి రాజస్థాన్‌కు చెందిన ఓ యూట్యూబర్‌ను తిరుమల విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన యూట్యూబర్ మంగళవారం దాదాపు పది నిమిషాల పాటు- శ్రీవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాను వినియోగించినట్లు- తెలిసింది. అంతకుముందు, ఉదయం నుంచే ఆ వ్యక్తి తిరుమలలోని వివిధ ప్రదేశాలలో వీడియోలు చిత్రీకరిస్తున్నట్లు విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. డ్రోన్ గగనతలంలో ఎగురుతున్న విషయాన్ని గమనించిన విజిలెన్స్ సిబ్బంది తక్షణమే స్పందించారు. ప్రస్తుతం యూట్యూబర్ ను విచారిస్తున్నామని, డ్రోన్ కెమెరా మెమరీ కార్డును స్వాధీనం చేసుకొని అందులోని దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## ఎపి ఫైబర్ నెట్ ప్రక్షాళన

### తిష్టవేసుకున్న 500 మందిఉద్యోగుల తొలగింపు

అమరావతి,ఏప్రిల్16(ఆర్ఎనన్ఎ): ఏపీ ఫైబర్ నెట్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీనిని ప్రక్షాళనేసే దిశగా చర్యలకు దిగింది. ఫైబర్ నెట్‌లో దాదాపు 500 మంది ఉద్యోగులను తొలగించింది. సూర్య ఎంటర్‌ప్రైజెస్ ద్వారా నియమించిన వారందరు కూడా ఈ నెలాఖరుకు ఫైబర్ నెట్ నుంచి బయటకు వెళ్లనున్నారు. ఇక ముందు ఎటువంటి పొడిగింపు ఉండబోదని కూడా సంస్థ యాజమాన్యం స్పష్టం చేసింది. వైసీపీ నేతలు చెప్పిన వారినందరినీ గతంలో అప్పటి యాజమాన్యం ఫైబర్ నెట్‌లో చేర్చుకుంది. పులివెందుల, కడప జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వారిని ఉద్యోగులుగా చేర్చిన అంశంపై తీవ్రవిమర్శలు వచ్చాయి. అప్పనంగా ఇందులో




సేదదీరుతున్న వారిపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం దాదాపు 500 మందిని ఫైబర్ నెట్ నుంచి తొలగించింది. గత టీడీపీ హయాంలో అతి తక్కువ ధరకు కేబుల్, నెట్, ఫోన్ సేవలను ప్రభుత్వం అందించింది. తక్కువ ధరకే నెట్ రావడంతో ఏపీలో పెద్ద సంఖ్యలో కనెక్షన్లు తీసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ ఫైబర్ నెట్‌ను అన్ని విధాలుగా నిర్వీర్యం చేశారని ఆరోపణలు వచ్చాయి. వైసీపీ హయాంలో పెద్దల అండదండలతో అనేక మంది ఫైబర్ నెట్‌లో చోటు పొందారు. ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడడంతో పాటు,పీకల్లోతు అప్పులో కూరుకుపోవడంతో పాటు- కనెక్షన్లు కూడా గణనీయంగా తగ్గిపోయాయి.దీంతో ఇందులో జరిగిన అక్రమాలను బయటపెట్టేందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.5400 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరుగగా.. దాదాపు రూ.500 కోట్లు- అక్రమాలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. వైసీపీ హయాంలో నియమితులైన ఉద్యోగులు కార్యాలయానికి రాకున్నా, వారికి జీతాలు మాత్రం చెల్లించేవారు. ఈ విషయం కూడా విచారణలో బయటపడింది. ఈ క్రమంలో గత ప్రభుత్వంలో నియమితులైన వారందరినీ పూర్తిగా ఉద్యోగాల నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

## పోర్న్‌సైట్లకు అశ్లీల వీడియోల సరఫరా

గుంటూరు,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ): అశ్లీల వెబ్‌సైట్లకు వీడియోలు సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు- 'ఈగల్' చీఫ్ ఆకే రవికృష్ణ తెలిపారు. ముగ్గురు నిందితులను గుంటూరులో పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. అశ్లీల వెబ్‌సైట్లకు నిందితులు వీడియోలను అందిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. గుంతకల్లుకు చెందిన లూయిస్ కాల్ సెంటర్ నడుపుతూ అక్కడ పనిచేస్తున్న వారితో బలవంతంగా అశ్లీల వీడియోలు చిత్రీకరిస్తున్నాడు. వాటిని నిషేధిత వెబ్‌సైట్లకు విక్రయిస్తున్నాడు. సైప్రస్ దేశానికి చెందిన సైట్ నిర్వాహకులు ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తున్నారు. లూయిస్‌తో పాటు- శ్రీకాకుళానికి చెందిన గణేశ్, జ్యోత్స్నలను అరెస్ట్ చేశాంఅని రవికృష్ణ తెలిపారు. అమ్మాయిలను ట్రాప్ చేసి ముగ్గులోకి దింపేవారు... అమ్మాయిల న్యూడ్ వీడియోలను బ్యాన్ చేసిన పోర్న్ వెబ్ సైట్లకు అమ్ముకుంటూ లక్షలకు లక్షలు సంపాదించేవారు... ఇలాంటి ఓ దుర్మార్గపు గ్యాంగ్ ఆట కట్టించారు సైబర్ సెక్యూరిటీ పోలీసులు.పల్లె గణేష్, తులగపు జ్యోత్స్నది శ్రీకాకుళం జిల్లా పాతపట్నం. ఉద్యోగం కోసం బెగళూరు వెళ్లారు. వీరికి అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన లూయిస్ తో పరిచయం ఏర్పడింది. లూయిస్ గుంతకల్లులో కాల్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ముగ్గురూ కలిసి ఈజీగా డబ్బు సంపాదించడంపై దృష్టిపెట్టారు. పోర్న్ వెబ్ సైట్లకు అమ్మాయిల వీడియోలు అమ్మితే భారీగా డబ్బులు వస్తాయని భావించారు. అంతే అప్పటినుంచి అమాయక అమ్మాయిలను ట్రాప్ చేయడం మొదలుపెట్టారు. కాల్ సెంటర్ కు వచ్చే అమ్మాయిలను మాయమాటలు చెప్పి ట్రాప్ చేసేవాడు. గణేష్, జ్యోత్స్నలు కూడా బెంగళూరులో అమ్మాయిలను ట్రాప్ చేసేవారు. వీళ్లు ఒక స్టూడియో సెటప్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. తమ ట్రాప్ లో పడిన అమ్మాయిలతో న్యూడ్ వీడియోలు తీసేవారు. సైప్రస్ కు చెందిన ఎక్స్ యాంపస్టర్ అనే పోర్న్ వెబ్ సైట్ తో లింక్ పెట్టుకున్నారు.

## జగన్ హెలి కాప్టర్ వ్యవహారం

### పైలెట్, కో పైలట్ల విచారణ

అనంతపురం,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనలో హెలికాప్టర్ వివాదంలో ఏపీ పోలీసులు చాలా సీరియస్‌గా ముందుకెళ్తున్నారు. జగన్.. పాపిరెడ్డిపల్లి పర్యటనలో జనం పెద్దఎత్తున దూసుకురావడంతో హెలికాప్టర్ దెబ్బతింది. దీంతో వీఐపీని అందులో తీసుకెళ్లలేమని పైలట్లు చెప్పారు. దీంతో జగన్ రోడ్డు మార్గాన బెంగళూరుకు వెళ్లారు. అయితే, ఇందులో నిజానిజాలెంత అనే దానిపై విచారణ చేపట్టారు. ఈ అంశంపై విచారణకు రావాలని పైలట్ అనిల్ కుమార్, కో పైలట్ శ్రేయస్ జైన్ కు నోటీసులు ఇచ్చారు. పోలీసుల నోటీసుల మేరకు బుధవారం చెన్నేకొత్తపల్లి పోలీసుల ఎదుట కోపైలట్ శ్రేయస్ జైన్ హాజరయ్యారు. కో పైలట్ ని డీఎస్పీ , సీఐలు సుదీర్ఘంగా విచారించారు. సుమారు 3 గంటల పాటు-.. 100 ప్రశ్నలు అడిగినట్టు తెలుస్తోంది. కుట్ర కోణం గురించి లోతుగా ఆరాతీశారు. టూవే బుకింగ్ చేసుకున్న సమయంలో హెలికాప్టర్ కు అర్ధాంతరంగా ఎందుకు ఫ్లై చేశారన్న కోణంలో ప్రశ్నలు అడిగినట్టు- తెలుస్తోంది. అయితే మెయిన్ పైలట్ ను విచారణకు పిలిచే యోచనలో ఉన్నట్టు- సమాచారం. రేపు పైలట్ అనిల్ కుమార్ కు నోటీ-సులు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. పైలట్ అనిల్ కుమార్ తో పాటు థర్డ్ పార్టీ టికెటింగ్ ఏజెన్సీ చిప్పన్ ఏవియేషన్ కంపెనీ కి కూడా నోటీ-సులు ఇస్తారని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. ప్రజల వల్ల హెలికాప్టర్ దెబ్బతిందా? లేకపోతే ఇక వేరే కారణమని ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు ఆరా తీసినట్టు- సమాచారం. చాపర్ అర్ధాంతరంగా వెనక్కి వెళ్లడంపై కో పైలట్ చెప్పిన అంశాలను రికార్డ్ చేశారు. ఏ నిబంధన ప్రకారం అలా వెళ్లాల్సి వచ్చిందో వివరణ కోరారు. ఃఊర లిస్ట్ ప్రకారం వెళ్లినట్లు- పోలీసులకు సమాధానం ఇచ్చిన కో పైలట్.. ప్యాసింజర్ సైడ్ విండో క్రాక్ ఇవ్వడంపై కూడా వివరాలు తెలుసుకున్నారు. విచారణ మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. అయితే ఈ వ్యవహారం ఇంకా ఎంత దూరం వెళ్తుందన్నది చూడాలి.. మరోవైపు.. దీనిపై రాజకీయ ఆరోపణలు, విమర్శలు కొనసాగుతూనే ఉన్నాయి..

## మార్క్ శంకర్‌పై అసభ్యకర పోస్టులు

### వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

గుంటూరు,ఏప్రిల్16(ఆర్ఎన్ఎ): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టి.. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశామని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ వెల్లడించారు. బుధవారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. మార్క్ శంకర్ లక్ష్యంగా పెట్టిన పోస్ట్‌లపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి.. దర్యాప్తు ప్రారంభించామన్నారు. అందులోభాగంగా దర్యాప్తు చేపట్టామని... దీంతో ఈ పోస్టులు పెట్టిన వ్యక్తి..కర్నూలు జిల్లాకు చెందిన పొట్టపాశం రఘు అలియాస్ పుష్పరాజ్‌గా గుర్తించామని చెప్పారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసినట్లు- తెలిపారు. అల్లు అర్జున్, పవన్ కల్యాణ్ మధ్య జరిగిన సోషల్ మీడియా వార్‌లో భాగంగా అతడు ఈ పోస్ట్ చేశారని పేర్కొన్నారు. అల్లు అర్జున్‌కు మద్దతుగా మెగా కుటు-ంబంపై రఘు అలియాస్ పుష్పరాజ్ ద్వేషం పెంచుకున్నాడని తెలిపారు. గతంలో మహిళలపై సైతం ఇతడు అసభ్యకరమైన పోస్టింగ్స్ పెట్టాడని గుర్తు చేశారు.

### అమ్మాయిలను ట్రాప్ చేసి వీడియోల చిత్రీకరణ

### గుంతకల్లు కేంద్రంగా ముగ్గురు వ్యాపారం

### గుట్టురట్టు చేసిన ఎసెవోటి పోలీసులు

ఈ పోర్న్ సైట్ ఇండియాలో బ్యాన్ చేశారు. అయితే వీరు మాత్రం యూఆర్ఎల్ లింక్ ద్వారా పోర్న్ వెబ్ సైట్ లోకి అమ్మాయిల న్యూడ్ వీడియోలను పంపించేవారు. ఈ వెబ్ సైట్ లో లైవ్ వీడియోలను కూడా పెట్టేవారు. ఇలా అమ్మాయిల న్యూడ్ వీడియోలు, లైవ్ లో న్యూడ్ వీడియోలు పెట్టడం ద్వారా భారీగా సంపాదించేవారు. అయితే సైబర్ సెక్యూరిటీ- పోలీసులకు వచ్చిన సమాచారంతో అలర్ట్ అయ్యారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో భయంకరమైన నిజాలు బయటపడ్డాయి. డబ్బులకోసం అమ్మాయిలను ట్రాప్ చేస్తున్నారని, వారి న్యూడ్ వీడియోలను లైవ్ లో పెట్టేందుకు ఏకంగా స్టూడియో ఏర్పాటు చేశారని దర్యాప్తులో తేలింది. ఇప్పటికే ఎక్స్ యాంపస్టర్ పోర్న్ వెబ్ సైట్ లో అనేక వీడియోలు, అమ్మాయిలతో లైవ్ లు కూడా ఇచ్చినట్లు- పోలీసులు చెబుతున్నారు. అమ్మాయిల అశ్లీల వీడియోలు పెట్టడం ద్వారా నిందితులు గణేష్, జ్యోత్స్న, లూయిస్ లు లక్షల్లో సంపాదించారని పోలీసుల విచారణలో తేలింది.

# సి బెళగల్ మండలంలో సర్వసభ్య సమావేశం

సి.బెళగల్ (విజయ సారధి):స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ బొంతల మునెప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి మండల టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలో రైతు రిజిస్ట్రీ కార్యక్రమం రైతు సేవ కేంద్రాలలో జరుగుతుంది. ప్రతి రైతు రైతు రిజిస్ట్రీ నెంబర్ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈ 11 అంకెల నెంబర్ ద్వారానే ప్రభుత్వం మంజూరు చేసే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, సబ్సిడీ మొదలగు పథకాలు పొందాలంటే రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని తెలియజేశారు. రైతులు యాంత్రికరణ పనిముట్ల కొరకు నమోదు చేసుకుంటే ప్రభుత్వము 50% సబ్సిడీస్తుందని తెలిపారు. అనంతరం మండల తహసిల్దార్ పురుషోత్తముడు మాట్లాడుతూ మండల ప్రజలు ఆన్లైన్ నమోదు, సబ్ డివిజన్, సర్వే, కాస్ట్, ఇన్కము, మొదలగు ధ్రువీకరణ పత్రాలను కావాలంటే ఆన్లైన్లో అప్లై చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తున్నామని ఎమ్మార్వో పురుషోత్తముడు తెలిపారు. హౌసింగ్ ఏఈ సుమంత్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మంజూరు చేసే గృహం కావాలంటే గ్రామ సచివాలయాలలో కల ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సంప్రదిస్తే వారికి మీయొక్క ఆధార్ కార్డులు రేషన్ కార్డులు కాస్ట్ ఇన్కమ్ సర్టిఫికెట్లు పొజిషన్ సర్టిఫికెట్లతో సంప్రదిస్తే ఆన్లైన్లో నమోదు చేస్తామని గృహ లబ్ధిదారులకు తెలియజేశారు. మండల విద్యాధికారిని జ్యోతి మాట్లాడుతూ గత సంవత్సరంలో అక్షరాస్యత శాతం కేవలం 38 శాతమే ఉందని ఈ సంవత్సరంలో అక్షరాస్యత రేటును పెంచాలని కృషి చేస్తున్నామని, అంతేకాకుండా ఎక్కడైతే అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉన్నాయో ఆ గ్రామాలలో ఉన్నత పాఠశాలలు కావాలని ప్రభుత్వానికి సిఫారసు చేశామని తెలియజేశారు. ఏపీఓ రామన్న మాట్లాడుతూ గత సంవత్సరానికి నాలుగు లక్షల పని దినాలు ఉండగా మా సిబ్బంది 4,32,000 పని దినాలను పూర్తి చేశారని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మినీ గోకులాలు, నీటితొట్లు, ఇంకుడు గుంతలు ఉన్నాయని తెలియజేశారు. విద్యుత్ శాఖ ఏఈ సుకుమార్ మాట్లాడుతూ గ్రామాలలో ఏదైనా కరెంటు సమస్యలు ఉంటే, కరెంటు స్తంభాలు పడిపోయే స్థితిలో ఉంటే మాకు తెలియజేసే ఆ సిబ్బంది ద్వారా కొత్త కరెంటు స్తంభాలను వేస్తామని తెలిపారు. చివరిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ సర్వసభ సమావేశానికి వైద్యశాఖ సిబ్బంది హాజరు కాకపోవడంతో డాక్టర్లపై ఎందుకు హాజరు కాలేదో వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశాడు. అనంతరం మండల ప్రజలను ఉద్దేశించి ప్రతి అధికారి ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పుకోకుండా రైతుల పనులను వెంటనే చేయాలని అధికారులకు సూచించారు. ఈ సర్వసభ్య సమావేశంలో మండల స్థాయి అధికారులు ఎంపీడీవో రానేమ్మ, ఎమ్మార్వో పురుషోత్తముడు, ఎంఈఓలు జ్యోతి ఆదం భాష, మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్, పశు వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, కరెంటు ఏఈ సుకుమార్, హౌసింగ్ ఎఇ సుమంత్, ఏపీఎం రమేష్, ఏపీవో రామన్న, పంచాయతీ రాజ్ ఏఈ ప్రకాష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుజాత మల్లేశ్వరి , వివిధ గ్రామాల నుండి సర్పంచులు ఎంపిటిసిలు తదితరులు పాల్గొని సర్వసభ్య సమావేశం విజయవంతంగా పూర్తి చేశారు




## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డుల పంపిణీ



సి బెళగల్ (విజయ సారధి):మండలంలోని స్థానిక ఎన్టీఆర్ పార్కులో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్యఅతిథిగా హాజరయ్యి మండలంలో గల తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సభ్యత్వం ద్వారా తెలుగుదేశం పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి సభ్యత్వం నమోదు చేసుకున్న వ్యక్తికి ఐదు లక్షల రూపాయల బీమా ఉంటుందని తెలియజేశారు . ఈ పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల సీనియర్ నాయకులు , పోలకల్ తిమ్మప్ప, ఎంపిటిసి ఈరన్న గౌడ్, బాలాజీ వెంకటేష్, మాజీ జెడ్పిటిసి చంద్రశేఖర్, అమర్నాథ్, ధనుంజయ, భీమన్న, జిక్రియ భాష, గౌస్, చికెన్ ఈరన్న, మారం దొడ్డి పెద్ద సోమన్న, సంఘాల అనుమంతు, కంపాడు యాకోబు, ఈర్లదిన్నె శ్రీనివాసులు, తిమ్మం దొడ్డి సూరి పలుకుదొడ్డి మల్లెపూగు గంగన్న కే రాంబుపాల్ రెడ్డి తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తప్పుడు కేసులతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను భయపెట్టలేరు:

### సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష

కర్నూలు(విజయ సారథి):బిజెపి కుతంత్రాలతో తప్పుడు కేసులతో కాంగ్రెస్ అధినాయకులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను భయపెట్టలేరని కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష హెచ్చరించారు. బుధవారం ఏఐసిసి పిలుపుమేరకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఇన్కమ్ టాక్స్ కార్యాలయం ముందు జరిగిన సత్యమేవ జయతే నిరసన కార్యక్రమమునకు అధ్యక్షత వహించిన జిలాని భాష మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి ఈడి చార్జిషీట్ లో రాహుల్ గాంధీ, సోనియాగాంధీ పేరు చేర్చడం జరిగిందనీ 1937లో జవహర్ లాల్ నెహ్రూ నేషనల్ హెరార్డ్ పత్రికను స్థాపించడం జరిగిందనీ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఈ పత్రిక పనిచేస్తుంటే ఈ పత్రికపై చర్యలు తీసుకొని సీజ్ చేయడం జరిగింది. అప్పుడు నెహ్రూ కాంగ్రెస్ పార్టీ తరఫున 90 కోట్ల రూపాయలు నేషనల్ హెలార్డ్ పత్రికకు ఆర్థిక సహాయం చేసి ఈ నేషనల్ హెలార్డ్ పత్రికను మళ్లీ పునర్ధరణ చేయడం జరిగింది. అప్పట్లో బ్రిటిష్ వారు ఈ పత్రిక పైన కుట్రలు పన్నీ ఈ పత్రికను మూసివేస్తే అప్పుడు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చింది. దీనిని యంగ్ ఇండియా వారు తీసుకొని ఈ పత్రికను నడిపించారు. అప్పుడు 50 లక్షల ప్రాపర్టీ అని చెప్పి ఆరోజు లెక్క వేస్తే సుబ్రహ్మణ్యం స్వామి 16 వందల కోట్ల రూపాయలు ఈ ప్రాపర్టీ విలువ చేస్తుందని కేసు వేయడం జరిగిందనీ అయితే 700 కోట్ల రూపాయలు 2023లో మొన్నటికి మొన్న ఈడి జప్తు చేయడం జరిగిందనీ కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా ఆస్తులు ఉన్నాయనీ కాంగ్రెస్ పార్టీ ఈ 5 వేల కోట్లపై ఆశపడి రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మోసం చేయాల్సిన అవసరం లేదని, ఈ దేశం కోసం ఆస్తులు త్యాగం చేశారనీ. వీరి కుటుంబం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలనే అర్పించారని ఈ ఐదువేల కోట్లకు ఆశ పడతారా అని వీరిపై పెట్టిన చార్జిషీట్ లో వీరీ పేర్లను వెంటనే తొలగించి ఈ దేశానికి క్షమాపణ చెప్పి నరేంద్ర మోడీ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని జిలాని భాష హెచ్చరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు మాట్లాడుతూ ఈరోజు దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాలతో ఈ నిరసన కార్యక్రమం చేపట్టాం ఇక్కడకు వచ్చిన ప్రతి ఒక్కరికి మోడీ అమిత్ షా లను గద్దె దింపే వరకు సోనియాగాంధీ రాహుల్ గాంధీ పై వేసిన కేసు ఉపసంహరించుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పోరాడాలని సుధాకర్ బాబు పిలుపునిచ్చారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుండి ఇన్కమ్ టాక్స్ ఆఫీసు వద్దకు వెళ్లి బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మోడీ అమిత్ షా డౌన్ డౌన్ బిజెపి డౌన్ డౌన్ అంటూ, సోనియా గాంధీ రాహుల్ గాంధీ లపై మోపిన ఈడి కేసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని నినాదాలు చేస్తూ సత్యమేవ జయతే నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, కోడుమూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, జిల్లా మహిళా కాంగ్రెస్ ఎస్ ప్రమీలమ్మ, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఖాద్రి పాషా, రియాజుద్దీన్, సయ్యద్ నవీద్, షేక్ మాలిక్ భాష, బి సుబ్రహ్మణ్యం, అబ్దుల్ హై, ఆర్ ప్రతాప్, వసీం, కే రవికుమార్ మొదలగువారు పాల్గొన్నారు.




## సోషల్ మీడియాలో నకిలీ అకౌంట్ లపై అప్రమత్తంగా ఉండాలి

### సోషల్ మీడియాలో జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారుల పేర్ల మీద నకిలీ అకౌంట్ లు సృష్టి

### నకిలీ అకౌంట్లు, ఫోన్ల ద్వారా డబ్బులు వసూలుకు పాల్పడుతున్న గుర్తు తెలియని వ్యక్తులు

### నిర్ధారించుకోకుండా ఎలాంటి డబ్బు పంపరాదు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం(విజయ సారధి):సోషల్ మీడియాలో జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారుల పేర్ల మీద నకిలీ అకౌంట్ లు సృష్టించి.. నకిలీ అకౌంట్లు, ఫోన్ల ద్వారా డబ్బులు వసూలుకు గుర్తు తెలియని వ్యక్తులు పాల్పడుతున్నారని, నకిలీ అకౌంట్ లపై సహ ఉద్యోగులు, ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సూచించారు. సహ ఉద్యోగులైనా, తెలిసినవారైనా నిర్ధారించుకోకుండా ఎలాంటి డబ్బులు పంపరాదన్నారు. సోషల్ మీడియాలో జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారుల పేర్ల మీద నకిలీ అకౌంట్ లు సృష్టించి డబ్బులు అడుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, జిల్లాలో ఒక మున్సిపల్ కమిషనర్, ఒక తహసిల్దార్, ఇతర ఉన్నతాధికారుల నకిలీ అకౌంట్ లను సోషల్ మీడియాలో సృష్టించి డబ్బులు కావాలని అడగడం జరిగిందన్నారు. ఈ విషయమై ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. పూర్తిగా నిర్ధారించుకున్న తర్వాతనే డబ్బులు పంపాలని సూచించారు. తెలిసినవారైనా, సహ ఉద్యోగులైన మెసేజ్ లు వచ్చిన వెంటనే డబ్బులు పంపరాదని, వారితో ఫోన్లో మాట్లాడి నిర్ధారించుకోవాలని, నకిలీ అకౌంట్ల విషయమై తమ పొరుగు వారికి కూడా తెలియజేయాలన్నారు. ఎవరికైనా సోషల్ మీడియాలో నకిలీ అకౌంట్ల నుంచి మెసేజ్ లు వచ్చిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. పలు సంఘటనలు జరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు.

## స్వర్గీయ ప్రజాభిమాని కాళ్ళ దొంగబాబు కాంస్య విగ్రహానికి భారీ ఏర్పాట్లు

.కాకినాడ(విజయ సారథి): కాకినాడ జిల్లా కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న స్థలంలో టిడిపి నాయకుడు, ప్రజాభిమాని స్వర్గీయ కాళ్ల దొంగబాబు విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థానిక టిడిపి నాయకులు జగపతినగరం గ్రామ సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, మండల తెదేపా అధ్యక్షుడు చదరం చంటిబాబు, మాదిరెడ్డి ప్రభాకర్ రావు, తూము కుమార్, కుర్ల చిన్నబాబు పలువురు టిడిపి నాయకులతో కలిసి బుధవారం శంకుస్థాపనచేశారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ఆధ్వర్యంలో 7 అడుగుల కాంస్య విగ్రహాన్ని కొత్తపేటకు చెందిన శిల్పి వడియర్ సిద్ధం చేస్తున్నారని ఈ విగ్రహం అతి తొందరలో నెలకొల్పేందుకు ఏర్పాటు జరుగుతున్నాయని దొంగబాబు కుమారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా పలువురు దొంగబాబు అభిమానులు, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# రెవిన్యూ అధికారులు అన్నిరకాల జీవోలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### అన్ని మండలాల రెవెన్యూ అధికారులకు రెవెన్యూ అంశాలపై వర్క్ షాప్





కడప(విజయ సారధి):రెవిన్యూ అధికారులు అన్నిరకాల జీవోలు, చట్టాలపై అవగాహన పెంచుకుని.. తమ పనితీరు మెరుగుపరచుకొని బాధ్యతాయుతంగా, జవాబుదారి తనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని సభా భవన్ లో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, వీఆర్వో, మండల సర్వేయర్ల తో వివిధ రకాల రెవెన్యూ అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం (వర్క్ షాప్) జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యులుగా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ? రెవిన్యూ సేవలలో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. పనితీరులో ప్రమాణాలు పెంచుకోవాలన్నారు. ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. వ్యవస్థలో లోపాలు సరిదిద్దుకొని ముందుకు వెళ్లగలిగినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుందని అన్నారు. ఏలాంటి సమస్య అయినా కాలాతీతం చేయకుండా వేగంగా స్పందించి చట్టప్రకారం చర్యలు చేపట్టి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను ఆయా గ్రామాల వారిగా క్రోడీకరించుకోవాలని సూచించారు. ప్రతి వారం పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం పై ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్ష చేస్తోందన్నారు.అత్యంత ప్రాధాన్యత కలిగిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించడమే మన బాధ్యత అని తెలియజేశారు. సమస్యలపైన అవగాహన పెంపొందించడానికితహశీల్దార్లు ప్రతి రోజు ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని, ఆ గ్రామంలోని సమస్యలపై దృష్టిసారించి పరిష్కార మార్గాలను వెదుకుతూ విజయవంతంగా మండల స్థాయిలో రెవెన్యూ సేవల పనితీరును మెరుగు పరచడం జరుగుతోందన్నారు. వేగంగా స్పందించి క్షేత్రస్థాయిలో వాస్తవాలను విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకొని అర్జీలను నాణ్యతగా సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం చేయడం, నిర్లక్ష్యం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని హెచ్చరించారు. భూముల అంశంలో నిబంధనలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు.గ్రామస్థాయిలో గుర్తించిన అర్జీలను పరిష్కరించడానికి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు వారంలో నాలుగు రోజులు విజిట్ చేసి పూర్తి అవగాహనతో పరిష్కరించాలన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ ఎంక్వయిరీలు నిర్వహించేటప్పుడు సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో కలసి పనిచేయాలన్నారు. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమించుకునే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములు, ఆర్ఓఆర్, పట్టాదారు పాస్ పుస్తకాలు, చట్టాలు తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి పని చేయాలన్నారు. 1142 జీవో ప్రకారం ఎలాంటి భూములను ఎవరికి అసైన్ చేయాలి అనే అంశానికి సంబంధించి విధివిధానాలపై, రీ సర్వే, వెబ్ లాండింగ్, మ్యుటేషన్స్ మొదలైన అంశాల్లో క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులకు ఎదురయ్యే సమస్యలు, అనుభవాలపై సమీక్ష నిర్వహించి, ఆయా రెవెన్యూ డివిజన్ అధికారులకు, తహసీల్దార్లకు పునశ్చరణ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, ల్యాండ్స్ సర్వే ఏడి మురళీకృష్ణ, నాలుగు రెవిన్యూ డివిజన్ల తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వో లు, తదితర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మాధవరంలో 23న మహానేత అంబెడ్కర్ నాటకం

### నాటక కరపత్రాలను విడుదల చేసిన తహశిల్దార్

మంత్రాలయం(విజయ సారథి): మాధవరం గ్రామంలో ఏప్రిల్ 23న నిర్వహించే సంఘం శరణం గచ్చామి నాటక కళా రూపాన్ని జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనందబాబు కోరారు.బుధవారం మంత్రాలయం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో సామాజిక చైతన్య సాంస్కృతిక కళా ఉత్సవం నాటక కరపత్రాన్ని తహసీల్దార్ సల్కాపురం రవి చేతుల మీదుగా, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ జయరాజు, మండల కార్యదర్శి జి అంజి, ఉపాధ్యక్షులు మారెప్ప, సురేష్, నాయకులు ఇజ్రాయిల్, ఎలీషా, దేవా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భావజాలాన్ని, సమైక్యత సిద్ధాంతాన్ని ప్రజల్లో మరింత బలంగా తీసుకుపోవడంలో భాగంగానే సంగం శరణం గచ్చామి అనే నాటకాన్ని రాష్ట్రవ్యాప్తంగా వేయిస్తున్నామన్నారు. ఏప్రిల్ 21న పెద్దకడుబూరు నుండి మొదలవుతున్న ఈ జ్ఞానయుద్ధం, 22న కర్నూలు మండలం ఉల్చాల, 23న మంత్రాలయం మండలం, మాధవరం. 24న ఎమ్మిగనూరు పట్టణం, 25న ఎమ్మిగనూరు మండలం ఏనుగుబాల, 26న కర్నూలు జిల్లా కేంద్రంలో వేస్తున్నామన్నారు. ప్రజలందరూ అంబేద్కర్ నాటకాలను ఆదరించి అత్యధిక సంఖ్య లో హాజరై జయప్రదం చేయాలన్నారు.



PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com